
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 10 డిసెంబరు 2025



అట్టహాసంగా గుమ్మసముద్రం తెప్ప తిరునాళ్ల

● గంగమ్మకు దీలు మోసిన ప్రజలు



గుమ్మసముద్రం చెరువు కట్టపై జనం కోలాహలం

బి.కొత్తకోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని గుమ్మసముద్రం చెరువు వద్ద మంగళవారం తెప్ప తిరునాళ్ల అట్టహాసంగా జరిగింది. ఈ చెరువు నిండిన ప్రతిసారీ సంప్రదాయబద్ధంగా తిరునాళ్ల నిర్వహించడం ఆనవాయితీ. ఇటీవల ఈ చెరువు నిండి మొరవపోవడంతో ఆయకట్టుదారులందరూ కలిసి మంగళవారం వేడుకను వైభవంగా చేసుకున్నారు. చెరువు కింద సాగు భూములున్న కొండకిందపల్లి, గండువారిపల్లి, బావగారిపల్లి, కొత్తపల్లి, అచ్చమ్మకోట గ్రామాల రైతులు, మహిళలు ఆయా గ్రామాల నుంచి చెరువు కట్ట మీద ఉన్న గంగమ్మకు దీలు మోసి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఈ దేవర సందర్భంగా వంశపారంపర్యంగా సాగుబడి కార్యక్రమం నిర్వహించే కొత్తపల్లికి చెందిన కొండకమర్ల కుటుంబ సభ్యులు ఈ ఏడాది కూడా సాగుబడి చేసి, పంట సాగుకు శ్రీకారం చుట్టారు. చెరువుకట్టపై ఉన్న గంగమ్మ, యల్లమ్మ ఆలయాలను సుందరంగా అలంకరించారు. ఐదు గ్రామాల ప్రజలు ఒక్కసారిగా కట్టమీదకు చేరుకోవడంతో సందడి నెలకొంది. దీనికి తోడు ఈ గుమ్మసముద్రంచెరువు కట్ట మీదుగానే మదనపల్లి-బి.కొత్తకోట రహదారి ఉండడంతో మరింత రద్దీ ఏర్పడింది. బి.కొత్తకోట సీఐ గోపాల్‌రెడ్డి సిబ్బందితో బందోబస్తు నిర్వహించి కార్యక్రమం సజావుగా జరిగేలా చూశారు.

డ్వాక్రా రుణం తీర్చమని వేధింపులు...

● సెల్‌టవర్ ఎక్కి మహిళ ఆత్మహత్యాయత్నం




సెల్‌టవర్ నుంచి ఫర్జానాను కిందకి దించుతున్న దృశ్యం

నిమ్మనపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా రుణం తీర్చమని గ్రూపు సభ్యులు, సీసీలు వేధించడంతో మనస్థాపానికి గురైన మహిళ సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి యత్నించింది. స్థానికుల వివరాల మేరకు... రియాజ్ భార్య షేక్ ఫర్జానా నిమ్మనపల్లి ఉర్దూ స్కూల్‌లో పిల్లలకు మధ్యాహ్న భోజనం చేస్తూ జీవనం కొనసాగించేది. అయితే ఆమె ఏడాది కిందట సింధు డ్వాక్రా గ్రూపులో రూ.లక్ష రూపాయలు రుణం తీసుకుంది. అయితే ఆ డబ్బును స్థానికంగా ఉన్న ఆటోడ్రైవర్ అఫ్జల్‌కు అప్పుగా ఇచ్చి అతడి నుంచి ప్రతినెలా ఆమె డబ్బు వసూలు చేసేది. కాగా ఎనిమిది నెలలుగా ఆటో డ్రైవర్ డబ్బు ఇవ్వకపోవడంతో ఆమె గ్రూపులో కంతును చెల్లించలేదు. దీంతో గ్రూపు సభ్యులు అందరూ కలసి ఆమె ఇంటి వద్దకు వెళ్లి డబ్బు చెల్లించాలని ఒత్తిడి తేవడం, సీసీలు కూడా ఆమెను కొట్టడంతో మనస్థాపానికి గురై సాయిబాబా గుడి వద్ద ఉన్న సెల్‌టవర్ ఎక్కింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కిందికి దిగితే సమస్యను పరిష్కరిస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆమె కిందికి దిగింది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



హలో.. మీ ఎమ్మెల్యే పనితీరెలా ఉంది..?

● టీడీపీ ఎమ్మెల్యేలపై అధిష్టానం ఆరా.. ● ఐవీఆర్ఎస్ కాల్స్‌తో అభిప్రాయ సేకరణ



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల పనితీరుపై పార్టీ అధిష్టానం ఆరా తీస్తోంది. ఈ మేరకు సోమ, మంగళవారాల్లో జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లోని ఓటర్లకు ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్ ద్వారా అభిప్రాయాన్ని సేకరిస్తున్నారు. ఓటర్ల ఫోన్లకు వస్తున్న ఫోన్‌కాల్స్‌లో.. హలో.. మీ నియోజకవర్గంలోని ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉంది..? బాగుంటే.. ఒకటి నొక్కండి.. ఫరవాలేదంటే.. రెండు నొక్కండి.. బాగా లేదు అయితే మూడు నొక్కండి. .అంటూ పెద్ద సంఖ్యలో ఫోన్లకు కాల్స్ వస్తున్నాయి. జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. అందులో రాయచోటి, పీలేరు, మదనపల్లె నియోజకవర్గాలలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు గెలుపొందారు. రైల్వేకోడూరులో జనసేన ఎమ్మెల్యే గెలిచారు. రాజంపేట, తంబళ్లపల్లెలో వైసీపీ ఎమ్మెల్యేలు గెలుపొందారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు 16 నెలలు పూర్తి కావస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోంది. ఇప్పటికే ఎన్నికల హామీలుగా ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ, ఇంట్లో ఎంతమంది బడికి వెళ్లే పిల్లలుంటే..అంతమందికీ రూ.14 వేల చొప్పున తల్లికి వందనం పేరుతో ఆర్థికసాయం.. రైతులకు సాగుకు పెట్టుబడి కింద రైతు భరోసా వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను కూడా పెద్ద ఎత్తున నిధులతో చేపడుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా వందలాది కోట్ల రూపాయలు ఖర్చు చేసి రోడ్లపైన గుంతలు పూడ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంత చేస్తున్నా.. కూటమి ప్రభుత్వంపైన ప్రజల్లో ఎక్కడో అసంతృప్తి కనిపిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు కూటమి ఎమ్మెల్యేలపైన తీవ్ర ఆరోపణలు రావడమే ఇందుకు కారణమని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యేల పనితీరుపైన ప్రజల నుంచి సమాచారం సేకరిస్తోంది. ఇప్పటికే ఎమ్మెల్యేల వ్యవహార శైలిపై రాష్ట్ర ప్రభుత్వం వివిధ మార్గాల ద్వారా సమాచారం మొత్తం సేకరించినట్లు తెలుస్తోంది. పలువురు ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉండకపోవడం.. ఇసుక అక్రమ రవాణా, భూముల ఆక్రమణతో పాటు అనేక అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా తమ ఎమ్మెల్యేలు గెలిచిన నియోజకవర్గాల్లో ప్రజల నుంచి ఎమ్మెల్యేల పనితీరుపైన సమాచారం సేకరిస్తోంది. ఈ నేపథ్యంలో రెండు రోజులుగా జిల్లాలోనూ.. ఎమ్మెల్యేల పనితీరుపై ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్ చేస్తోంది. అయితే ఈ ఫోన్‌కాల్స్ విషయం తెలుసుకున్న కొందరు ఎమ్మెల్యేలు, వారి అనుచరులు ఈ కాల్స్ వస్తున్న విషయాన్ని తమ పార్టీ వాట్సప్ గ్రూపుల్లో షేర్ చేస్తూ.. మన ఎమ్మెల్యేకు అనుకూలంగా సమాధానం ఇవ్వమని కోరారు. ఈ నేపథ్యంలో రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఐవీఆర్ఎస్ కాల్స్ గురించే చర్చ నడుస్తోంది.

నేటి నుంచి టెట్

● పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
● డీఆర్వో మధుసూదన్‌రావు



మాట్లాడుతున్న డీఆర్వో మధుసూదన్‌రావు

రాయచోటి (నేతాజీ సర్కిల్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టెట్ (టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్) బుధవారం నుంచి ఈనెల 21వ తేదీ వరకు జరుగుతాయని, పరీక్షల కోసం పక్కాగా ఏర్పాట్లు చేయాలని డీఆర్వో మధుసూదన్‌రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం డీఆర్వో చాంబర్‌లో టెట్‌పై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ పరీక్షలు జిల్లాలోని 4 కేంద్రాలు మదనపల్లిలో ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 1798 మంది, అంగళ్లు సమీపంలోని మదనపల్లి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో 200 మంది, రాయచోటిలోని శ్రీసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ 1080 మంది, రాయచోటిలోని భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ కళాశాలలో 1845 మంది మొత్తం 4923 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్ష ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు రెండు సెషన్‌లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మదనపల్లిలోని ఆదిత్య కాలేజికి ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, మిట్స్ సెంటర్‌కు ఎంఈవో కె.ద్వారకనాథ్, సాయి కాలేజికి ఎం.బాలాజీనాయక్, భాస్కర్ కళాశాలకు పి.జయచంద్రలను డిపార్ట్‌మెంటల్ అధికారులుగా నియమించామని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లుగా డిప్యూటీ ఈవో లోకేశ్వర్‌రెడ్డి, నాగయ్య, ఏడీ రవికుమార్‌లను నియమించామన్నారు. పరీక్షా కేంద్రాలకు సంబంధించిన హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్లు, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ 83411 77406, 85559 31971, సూపరింటెండెంట్ 99499 15837, సీనియర్ అసిస్టెంట్ 70136 22899, డేటా ఎంట్రీ ఆపరేటర్ 94922 77147 ఏర్పాటు చేశామని తెలిపారు.

కడప-రేణిగుంట రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

● భూమిపూజ చేసిన నేతలు
● శరవేగంగా రోడ్డు మరమ్మతు పనులు

6

జయచంద్రారెడ్డి పీఏ రాజేశ్ అరెస్టు



కోర్టు వద్ద నిందితుడు రాజేశ్

ములకలచెరువు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు నకిలీ మద్యం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. టీడీపీ నుంచి సస్పెండైన దాసరిపల్లి జయచంద్రారెడ్డి పీఏ రాజేశ్ (ఏ5)ను ఎక్సైజ్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. కేసులో ముందస్తు బెయిల్ కోసం విజయవాడ హైకోర్టు లాయర్‌ను కలిసి వస్తుండగా ఓ బస్సులో వస్తున్న రాజేశ్‌ను ఎక్సైజ్ పోలీసులు నెల్లూరు జిల్లా నాయుడుపేట వద్ద అదుపులోకి తీసుకున్నారు. రాజేశ్‌ను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు కేసులో మరో నిందితుడైన జయచంద్రారెడ్డి ఇంట్లో పనిచేసే బాబు అలియాజ్ అన్బురాసు (ఏ19) ఆచూకీ రాజేశ్‌కు తెలియడంతో అతడి కోసం బెంగళూరుకు వెళ్లి అతడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టులో రాజేశ్‌ను హాజరుపరిచారు. దీంతో జడ్జి ఉమర్ ఫరూక్ 14 రోజులు రిమాండ్ విధించడంతో మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు. బాబును అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తున్నారు. ఇతడిని బుధవారం అరెస్టు చూపే అవకాశం ఉంది. జయచంద్రారెడ్డి పీఏగా పనిచేస్తున్న రాజేశ్, ఇంట్లో పనిచేసే బాబులు కేసులో కీలక నిందితులు. రాజేశ్‌ను అరెస్టు చేయడం, బాబును అదుపులోకి తీసుకుని విచారిస్తుండడంతో ఇద్దరు కూడా విచారణలో ఏమి చెబుతారోనని తీవ్ర చర్చ జరుగుతోంది. తాజా పరిణామాలతో నకిలీ మద్యం కేసు కీలక మలుపు తిరిగే అవకాశం ఉంది. ములకలచెరువు కేంద్రంగా జరిగిన నకిలీ మద్యం వ్యవహారం అక్టోబరు 3వ తేదీ బయటపడిన విషయం విదితమే. అప్పటి నుంచి ఇప్పటి వరకు తప్పించుకుని తిరుగుతున్న కీలక నిందితుడు రాజేశ్ దొరకడం, అలాగే బాబును కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తుండంతో కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

శభాష్...నరసింహుడు

● అనాథ శవానికి సొంత నిధులతో అంత్యక్రియలు
● పాడె మోసి మానవత్వాన్ని చాటుకున్న ఎస్ఐ

ములకలచెరువు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు ఎస్ఐ నరసింహుడు మానవత్వాన్ని చాటుకున్నారు. అనాథ శవానికి సొంత నిధులతో అంత్యక్రియలు నిర్వహించారు. తానే దగ్గరుండి పాడె మోశారు. మేళతాళాలు పెట్టించి..బాణా సంచా కాల్పించారు. అనాథ శవానికి అన్నీ తానై అంత్యక్రియలు నిర్వహించిన ఎస్ఐ నరసింహుడును గ్రామస్థులు అభినందించారు. వివరాల్లోకి వెళితే...ములకలచెరువు మండలం కదిరినాథునికోట పంచాయతీ గాలేటివారిపల్లెలో 15 ఏళ్ల క్రితం నుంచి ములకలచెరువుకు దగ్గరలోని ముంబాయి-చెన్నై జాతీయ రహదారి పక్కనే ఉన్న గ్రామంలో వృద్ధుడు నరసింహులు (80) తిరుగుతూ గ్రామస్థులు పెట్టిన భోజనం తిని బస్‌షెల్టర్‌లో ఉండేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నరసింహుడు గ్రామానికి చేరుకుని వృద్ధుడి గురించి ఆరా తీయగా అనాథ అని గ్రామస్థులు తెలిపారు. దీంతో ఎస్ఐ తన సొంత నిధులతో మేళతాళాలు, బాణాసంచా కాల్పిస్తూ పాడెను మోసి శ్మశానంలో ఖననం చేయించారు. డాక్టర్ కళ్యాణ్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు కోనంగి శ్రీనివాసులు, కోనంగి హరీష్, దేరంగుల మస్తాన్, పూజారి హనుమంతు, కోనంగి ప్రశాంత్, విష్ణు, జహీర్‌లు ఎస్ఐకి సహకరించారు.



పాడె మోస్తున్న ఎస్ఐ నరసింహుడు

వానర ఫీట్లు...



వైరుపై సర్కస్ ఫీట్లు చేస్తూ...



గ్రామీణ ప్రాంతాలకు పరిమితమైన వానరాలు ఆహారం కోసం పట్టణాలకు వలస వస్తున్నాయి. ఇళ్లలోకి దూరి దొరికింది తీసుకుని తింటున్నాయి. ఈ క్రమంలో మంగళవారం రైల్వేకోడూరు పట్టణంలో వానరాల మంద వచ్చిపడింది. మహిళలు ఆరేసిన చీరలను ముసుగుగా కప్పుకోవడం, వాటిని కింద పారవేయడం, చెట్టు కొమ్మలపై నడవడం, తీగలపై ఊగడం, ఎగిరిదూకడం, పల్టీలు కొట్టడం వంటి సర్కస్ ఫీట్లు చేశాయి.

- రైల్వేకోడూరు, (ఆంధ్రజ్యోతి)



చీరను చుట్టుకుని దొంగాట ఆడుతూ...



ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచేందుకు చర్యలు

● కలెక్టర్ నిశాంత్ కుమార్



ఏపీఐఐసీ-1 లేఔట్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

పీలేరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మందకొడిగా సాగుతున్న ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. పీలేరులోని ఏపీఐఐసీ-1 లేఔట్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన హౌసింగ్ అధికారులతో మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణంలో వేగం పెరగాలంటే ఇటుకలు, ఇసుక, తాపీ మేస్త్రీలు, కూలీలు, సెంట్రింగ్ నిపుణులు, ఇంటి సుందరీకరణ నిపుణులు అందుబాటులో ఉండాలన్నారు. ప్రస్తుతం ఆ రంగాల్లో నిపుణులు, కూలీల కొరత ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. సాధారణ ఇటుకల స్థానంలో సిమెంటు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల్లో ఇటుకలు తయారు చేసేందుకు ప్రోత్సహించాలని, అటువంటి యూనిట్లు స్థాపించుకునేందుకు రుణాలు అందజేసి ప్రోత్సహిద్దామన్నారు. అదేవిధంగా ఇళ్లలో ఫాల్స్ సీలింగ్, పెయింటింగ్, డెకరేషన్, మోల్డింగ్‌కు అవసరమైన సెంట్రింగ్ వంటి పనులు చేసే వారికి శిక్షణ ఇవ్వడమే కాకుండా స్వంతంగా యూనిట్లు నెలకొల్పేందుకు సబ్సిడీ రుణాలు అందిస్తామన్నారు. ఆవాస్ ప్లస్ సర్వే తరువాత ఇళ్లు మంజూరైన వెంటనే చాలామంది లబ్ధిదారులు ఒకేసారి ఇళ్ల నిర్మాణాలు ప్రారంభిస్తారని, అప్పుడు లబ్ధిదారులకు ఇబ్బందులు కలుగకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాలనీల్లో వసతుల కల్పనపై దృష్టి సారించాలన్నారు. కాలనీల్లో ఇళ్లకు అసెస్మెంటు నెంబరు ఇచ్చి పన్నులు వసూలు చేయాలని, ఆ పన్నుల రూపంలో వసూలయ్యే మొత్తంతో కాలనీల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చునన్నారు. మురుగునీటి వ్యవస్థ అభివృద్ధి కోసం కాలనీల్లో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ రమేశ్‌రెడ్డి, డీఈ రమణయ్య, ఎంపీడీవో శివశంకర్, తహసీల్దారు శివకుమార్, ఆర్ఐ మురగయ్య, సర్వేయర్ రెడ్డిశేఖర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయానికి భవనాల పరిశీలన

● ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భవనాలను పరిశీలిస్తున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

మదనపల్లె టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా ఏర్పడ్డాక జిల్లా ఎస్పీ కార్యాలయం, అనుబంధ విభాగాల కోసం అవసరమైన భవనాల పరిశీలన ముమ్మరం చేశారు. మంగళవారం ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మదనపల్లె పట్టణంలో పలు ఎయిడెడ్ విద్యాసంస్థల భవనాలను పరిశీలించారు. స్థానిక పుంగనూరు రోడ్డులోని సీఎస్ఐ బాలికోన్నత పాఠశాలను పరిశీలించిన ఎస్పీ అక్కడి హెచ్‌ఎంతో భవనాల వివరాలను, స్కెచ్‌లను సేకరించారు. అనంతరం బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని పీజీ బ్లాక్, లైబ్రరీ భవనాన్ని ఎస్పీ పరిశీలించారు. దీంతో పాటు అయ్యప్పస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలోని రేస్ కళాశాల, జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల, బీటీ కళాశాల మైదానాన్ని ఎస్పీ పరిశీలించారు. ఎస్పీ కార్యాలయంతో పాటు అనుబంధ విభాగాలైన అదనపు ఎస్పీ, స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్, డీసీఆర్‌బీ, ఆర్మ్‌డ్ రిజర్వ్, పోలీసు, ఎంటీ అధికారుల కార్యాలయాల ఏర్పాటుకు అనువైన భవనాలను ఒకేచోట ఉండటానికి అనువైన భవనాలను పరిశీలించారు. కాగా జిల్లా పోలీసు కార్యాలయానికి ముఖ్యమైన పోలీసు పెరేడ్‌గ్రౌండ్ ఉన్న భవనాలు సక్రమంగా లేవని తెలుస్తోంది. కేవలం నిమ్మనపల్లె రోడ్డులోని ప్రభుత్వ మోడర్న్ పాలిటెక్నిక్ (జీఎంఆర్) కళాశాల మాత్రమే మైదానంతో పాటు విశాలమైన 38 ఎకరాల స్థలం ఉండటంతో దీనివైపే పోలీసు అధికారులు సుముఖత వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. కాకపోతే ఇక్కడ పాలిటెక్నిక్ విద్యార్థులు ఉండటంతో వీరిని ఎక్కడికి తరలించాలన్నదే ప్రశ్నగా మారుతోంది. మొత్తం మీద భవనాల వెతుకులాటలో పోలీసు అధికారులు తలమునకలై ఉన్నారు. కార్యక్రమంలో మదనపల్లె డీఎస్పీ మహేంద్ర, వన్‌టౌన్, తాలూకా సీఐలు మహ్మద్‌రఫి, వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

పది పదుల ప్రణాళిక

● ఉత్తమ ఫలితాల సాధన కోసం విద్యా శాఖ కసరత్తు
● ఏ బీ సీ డీ గ్రేడులుగా విద్యార్థుల విభజన
● చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



కడప (ఎడ్యుకేషన్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పదో తరగతి తొలి మెట్టు. ఇందులో ప్రతిభ చూపాలని ప్రతి విద్యార్థి ఆశిస్తుంటాడు. ఆ మేరకు విద్యార్థులను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక దృష్టి సారించింది. కార్యాచరణ సిద్ధం చేసి మారిన సిలబస్‌ను దృష్టిలో ఉంచుకుని అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్న పాఠశాలల్లో సర్దుబాటుతో తాత్కాలిక ఏర్పాట్లు చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నారు. పరీక్షల షెడ్యూల్ కూడా విడుదల కావడంతో ఈనెల 6వ తేదీ నుంచి మార్చి 15వ తేదీ వరకు 100 రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారు. తమ భవిష్యత్తుకు కీలకమైన పదో తరగతి పరీక్షలను ఓ సమరంలా భావించి విద్యార్థులు సన్నద్ధమవుతుండగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా ప్రాధాన్యమిస్తూ వారిని సంసిద్ధులను చేస్తున్నారు.

పాఠశాల విద్యా శాఖ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం మార్చి 16వ తేదీ నుంచి ప్రధాన పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మూడు నెలల వ్యవధిలో విద్యార్థులు పక్కా ప్రణాళికతో పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు వంద రోజుల ప్రణాళికలను అనుసరిస్తున్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ రోజుకో సబ్జెక్టు పునశ్చరణ పరీక్షలు రాయిస్తున్నారు. వాటిని ఎప్పటికప్పుడు సరిదిద్ది విద్యార్థుల లోపాలను మెరుగుపరుస్తున్నారు. చదువులో వెనుకబడిన పిల్లలకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నారు.

పాఠ్యాంశాల మార్పుతో..

పదో తరగతి పాఠ్యాంశాలు 2024-25 విద్యా సంవత్సరం నుంచి, హిందీ పాఠ్యాంశం 2025-26 నుంచి పూర్తిగా మారాయి. పరాక్, ఎన్‌సీఈఆర్టీ మార్గదర్శకాలకు అనుగుణంగా బోధన-మూల్యాంకన విధానంలో జరిగిన మార్పుల వలన కొంతమంది విద్యార్థులు, తల్లిదండ్రుల్లో గందరగోళం నెలకొన్నట్లు విద్యాశాఖ గుర్తించింది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు వంద రోజుల ప్రణాళికను విద్యాశాఖ రూపొందించింది.

విద్యార్థుల విభజన

విద్యార్థుల స్థాయిని బట్టి సీ, డీ గ్రేడ్ విద్యార్థులను రైజింగ్ స్టార్స్‌గా.. ఏ, బీ గ్రేడ్ విద్యార్థులను షైనింగ్ స్టార్స్‌గా విభజించి ప్రత్యేక బోధన, రెమిడియల్ క్లాసులు, అదనపు సాధన చేయించేలా ప్రణాళిక రూపొందించారు. లెవెల్-1 ప్రశ్నలు అన్నీ విద్యార్థులు తప్పనిసరిగా నేర్చుకోవాలి, లెవెల్-2ను ప్రధానంగా ప్రతిభావంతులు అభ్యసించాలని సూచించారు.

రోజువారీ స్లిప్ టెస్టులు

ప్రతిరోజూ సాయంత్రం 4 గంటలకు స్లిప్ టెస్టులు, ఉదయం 8-9 గంటలకు సమాధానాల విశ్లేషణ, రెమిడియల్ బోధన నిర్వహించాలని సూచించారు. మార్కులను లీప్ యాప్‌లో నమోదు చేయడం తప్పనిసరి చేశారు.

స్టడీ మెటీరియల్ లీప్‌యాప్‌లో

డీజీఈ, ఏపీ మూడు మోడల్ పేపర్లు, లెవెల్ వైజ్ ప్రశ్నాబ్యాంక్, స్టడీ మెటీరియల్‌ను లీప్ యాప్‌లో అందుబాటులో ఉంచింది. బీఎస్ఈ వెబ్‌సైట్‌లో ఉన్న అదనపు మోడల్ పేపర్లను కూడా తప్పనిసరిగా సాధన చేయించేలా సూచించారు. ఆదివారాలు, రెండో శనివారాల్లో క్లాసులు నిర్వహించే సందర్భంలో అమ్మాయిల భద్రత, మిడ్‌డే మీల్ ఏర్పాటు, విద్యార్థుల రవాణా వంటి అంశాల్లో పాఠశాలలు పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే జిల్లా, మండల శిక్షణ అకడమిక్ బృందాలు ఈ కార్యాచరణ ప్రణాళికను క్రమం తప్పకుండా పర్యవేక్షించి, సరైన రికార్డులతో ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాలు జారీ చేశారు.

ఔషధ నియంత్రణ తనిఖీ కేంద్రం ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించిన మంత్రి సత్యకుమార్ యాదవ్



ఔషధ నియంత్రణ తనిఖీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని ఔషధ నియంత్రణ తనిఖీ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 11 ఔషధ నియంత్రణ తనిఖీ కేంద్రాలు, 2 ల్యాబ్‌లను ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అమరావతి నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డ్రగ్స్ నాణ్యత, ఎక్స్‌పైరీ తేదీలను తప్పక పరిశీలించాలన్నారు. ఆస్పత్రిలో అధికారులు ల్యాబ్‌లను, మందులు దుకాణాలను తనిఖీ చేయాలని సూచించారు. త్వరలో జనరిక్ మందుల షాపులను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అధికారులు వైద్య సేవలను సక్రమంగా అందించి రెఫర్ తగ్గించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జ్ మెడికల్ సూపరింటెండెంట్ కవిత, డ్రగ్స్ నియంత్రణ కేంద్రం అదనపు డైరెక్టర్ షేక్ ఆశ, మదనపల్లె, అనంతపురం డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు కలందర్, కేశవరెడ్డి, మదనపల్లె మెడికల్ స్టోర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, జిల్లా కార్యదర్శి భూషణ్‌గుప్తా, మదనపల్లె కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి బాలాజీ, మదనపల్లె నేతలు మాలతి, మురళి, సత్యప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనులకు ప్రాధాన్యం : పీడీ



మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

కురబలకోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం వ్యవసాయరంగానికి దోహదపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు. మంగళవారం మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు లాభసాటి వ్యవసాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువుల షెడ్లు, పశుగ్రాసం, పండ్లతోటల పెంపకం మెటీరియల్స్ బిల్లులను వారం రోజుల్లోగా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగయ్య, ఏపీడీ నందకుమార్, ఏపీవో సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులపై దృష్టి పెట్టండి

తంబళ్లపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకంలో రైతులకు ఉపయోగపడే పనులపై దృష్టి పెట్టాలని ఉపాధి పీడీ వెంకటరత్నం సూచించారు. మంగళవారం ఏపీడీ నందకుమార్‌రెడ్డితో కలసి తంబళ్లపల్లె మండలంలో పర్యటించారు. తొలుత కన్నెమడుగు సచివాలయాన్ని సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బాహూజీ పట్నాయక్, ఏపీవో అంజనప్పతో కలసి ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. గతంలో ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయకపోడంపై సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏవో థామస్‌రాజ, డిప్యూటీ ఎంపీడీవోలు ప్రసాద్, మారుతీకుమార్, ఈసీ మహేశ్, టీఏలు సుజాత, పుష్పకుమారి ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ముదివేడులో 'బంగారం' సినీసందడి



పూజలు చేస్తున్న సినిమాలోని నటీనటులు

కురబలకోట, డిసెంబరు 9((ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదివేడులో 'బంగారం' సినీసందడి నెలకొంది. మంగళవారం మండలంలోని ముదివేడులో వెలసిన దండుమారెమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి షూటింగ్‌ను ప్రారంభించారు. కుషి ఫిలిమ్స్ బ్యానర్‌పై చిత్రాన్ని నిర్మించనున్నట్లు ప్రొడ్యూసర్లు పి.రమేష్, కె.రాజేష్‌రెడ్డి, గాయత్రమ్మ అంజనప్ప పేర్కొన్నారు. ఈ చిత్రాన్ని మదనపల్లె పరిసర ప్రాంతాల్లో 3 నెలల పాటు చిత్రీకరించి పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరి నుంచి నిర్విరామంగా జరిపి జూన్ నెలాఖరులో విడుదలకు సన్నాహాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ చిత్రం ప్రేమ, ఫ్యాక్షన్, ఎమోషనల్‌తో నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ చిత్రానికి హీరోగా ఘట్టమనేని కుటుంబానికి చెందిన శరణ్‌కుమార్, హీరోయిన్‌గా సంకీర్తన, దర్శకుడు సుధాకర్ అని తెలిపారు.

యూత్ ఫెస్టివల్‌కు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ కుమారస్వామిగుప్త

వేంపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ హిందుస్థాన్ యూనివర్సిటీలో కలైకూడం-2025 సౌత్‌జోన్ యూత్ ఫెస్టివల్‌కు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఎంపికయ్యారు. నూజివీడులో నవంబరు 8వ తేదీ జరిగిన 39వ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్ కల్చరల్ పోటీల్లో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీకి చెందిన విద్యార్థులు కూచిపూడి, జానపద బృంద నాట్యం, ఇండియన్ బృంద గానం, క్రియేటివిటీ కొరియోగ్రఫీ, వెస్టన్ ఇన్‌స్ట్రుమెంట్ డిబేట్ పోటీల్లో 32 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి సౌత్‌జోన్ ఫెస్టివల్‌కు ఎంపికయ్యారని ట్రిపుల్‌ఐటీ ఫైన్ ఆర్ట్స్ విభాగాధిపతి మొయినుద్దీన్‌ఖాన్ తెలిపారు. ఈనెల 19 నుంచి 23 వరకు జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

పొలం పనుల్లో బిజీ..బిజీగా...



గొబ్బురివారిపల్లెలో తెల్లవారగానే పంట పొలాల్లో రైతు కూలీలు



గొబ్బురివారిపల్లెలో మందులు పిచికారీ చేస్తున్న దృశ్యం

రాజంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు పడ్డాయి.. అన్నదాత పొలం పనుల్లో బిజీ అయ్యాడు. తమకున్న అరకొర పొలాల్లో వరి, వేరుశనగ, పసుపు తదితర పంటలను సాగు చేయడానికి సిద్ధమయ్యాడు. ఇటీవల కురిసిన ఒక మోస్తరు వర్షాలు, నదుల్లో నీరు రావడం, చెరువులో నీరు చేరడం, భూగర్భజలాలు పెరగడం వల్ల రాజంపేట డివిజన్‌లో ఏ గ్రామంలో చూసినా రైతులు వివిధ పంటలను సాగు చేస్తున్నారు. ఇంటిల్లిపాది పంట పొలాలవైపు కదులుతున్నారు. కూలీలను వెంటేసుకుని పొలాలకు వెళ్లి వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం చలికాలం అయినా వేకువజామునే లేచి భుజంపై పలుగు పారా పట్టుకుని ఉదయించే సూర్యుడి తొలిపొద్దులో చలిని కాచుకుంటూ అదో గమ్మత్తైన వాతావరణంలో వ్యవసాయ పనులు చేసుకొంటున్నారు.



గట్టుమీదపల్లెలో ఉదయమే పనిచేసి గట్లపై భోజనాలు చేస్తున్న రైతులు



వరి నాట్లలో మహిళలు



చిట్వేలి మండలం నగరిపాడులో దుక్కులు దున్నుతున్న రైతు

పిల్లల ఆరోగ్యంలో ఐసీడీఎస్ పాత్ర కీలకం



మాట్లాడుతున్న కలెక్టర్

రాయచోటి (నేతాజీ సర్కిల్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పిల్లల పోషణ, ఎదుగుల ఆరోగ్య ఫలితాలను మెరుగుపర్చడానికి ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సీడీపీవో, సూపర్‌వైజర్లను కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని బాలసంజీవని టీహెచ్ఆర్ డిస్ట్రిబ్యూషన్, గ్రోత్ రిపోర్టు పోషన్ ట్రాకర్, పీఈఎస్ హాజరు, బీటీ కిట్, తదితర అంశాలపై సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సమావేశాల్లో ఎక్కువ శాతం విద్య, ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమ శాఖకు ఎక్కువ శాతం బడ్జెట్ కేటాయిస్తోందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, పాలిచ్చే తల్లులకు పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు అందజేయడం జరుగుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు అందించే ఆహారం వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

కార్పొరేట్‌కు దోచిపెడుతున్న ప్రభుత్వాలు

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జుల ఈశ్వరయ్య

రైల్వేకోడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఆరోపించారు. మంగళవారం రైల్వేకోడూరు సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ శక్తుల కారణంగా దేశం నాశనం అవుతోందని, అందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయని ఆరోపించారు.

రాష్ట్రంలో కొత్త జిల్లాల ఎంపిక శాస్త్రీయ పద్ధతిలో లేదన్నారు. రవాణా సౌకర్యం, వనరులు, అభివృద్ధి తదితర అంశాలతో పాటు ప్రజల ఆమోదంతో నూతన జిల్లాలు ఎంపిక చేయాలన్నారు. ఇందులో కూడా మెజార్టీ అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అన్నమయ్య జిల్లా ఎంపిక ప్రక్రియ గత ప్రభుత్వంలోను, ప్రస్తుత ప్రభుత్వం లోను సక్రమంగా జరగలేదంటూ ఆందోళన మొదలైందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించి వ్యాపారులకు అండగా నిలిచిందన్నారు. భారత రాజ్యాంగం నుంచి లౌకికవాదం, ప్రజాస్వామ్యంను తొలగించడానికి బీజేపీ కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు బిల్లును ప్రవేశపెడుతోందని ఆరోపించారు. భారత రాజ్యాంగానికి తూట్లు పొడిస్తే దేశానికి తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మతాలు, కులాలను రెచ్చగొట్టే పార్టీలు మనుగడ సాధించలేవన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, రైల్వేకోడూరు పార్టీ అధ్యక్షుడు జ్యోతి చిన్నయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్, విద్యార్థి నాయకుడు తుమ్మల చైతన్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మడుమూరులో ఘనంగా వాటర్‌షెడ్ మహోత్సవ్



జలహారతి ఇస్తున్న వాటర్‌షెడ్ అధికారులు, రైతులు

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర జల్‌శక్తి అధ్వర్యంలో వాటర్‌షెడ్ నిర్మాణ పనులను తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పెద్దతిప్పసముద్రం, మొలకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట, బి.కొత్తకోట మండలాల్లో వివిధ రకాల పనులను చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం మడుమూరులో ఆరు మండలాలకు చెందిన వాటర్ షెడ్ సిబ్బంది, రైతులతో కలిసి వాటర్‌షెడ్ మహోత్సవ్ కార్యక్రమాన్ని పీవో ఖాజామొయినుద్దీన్ అధ్వర్యంలో మడుమూరు సచివాలయం వద్ద నిర్వహించారు. ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ వాటర్ షెడ్ నిర్మాణ పనులను చేపట్టడం ద్వారా నీటి నిల్వలు సమృద్ధిగా ఉంటున్నాయని, సంపతికోట ప్రాజెక్ట్ పరిధిలోని పెద్దతిప్పసముద్రం మండలంలో ఆరు గ్రామాలను పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశామన్నారు. మడుమూరు గ్రామంలో చేపట్టిన పెద్ద ఊటకుంటలు కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. దీంతో ఆ ఊటకుంటలకు జలహారతి సమర్పించి జాతికి అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ సిబ్బంది, మడుమూరు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రవీంద్రబాబు, నవీన్, గురుమూర్తి, రాఘూరివాండ్లపల్లె వెంకట్రమణ రాజు, రాజారెడ్డి, శెట్టిపల్లె కిట్టన్న, లక్ష్మీనారాయణ పలువురు రైతులు పాల్గొన్నారు.

కురవంక సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

మదనపల్లె టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కురవంక సర్పంచ్ చెక్‌పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేసినట్లు డీపీవో రాధమ్మ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కురవంక పంచాయతీకి సంబంధించి చెత్త తరలించే వాహనాలు, ఇతర ఖర్చుల విషయమై సక్రమమైన బిల్లులు, ఓచర్లు సమర్పించకపోవడంతో సర్పంచ్ చలపతికి సంజాయిషీ నోటీసులు జారీ చేశారని, దీనికి సర్పంచ్ నుంచి 10 రోజుల గడువు ఇచ్చినా బిల్లులు, ఓచర్లు సమర్పించలేదన్నారు. దీంతో ఈనెల 9వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు సర్పంచ్ చెక్ పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు డీపీవో ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈ సందర్భంగా సర్పంచ్ చలపతి మాట్లాడుతూ రాజకీయ దురుద్దేశ్యంతోనే తమకు పంచాయతీ రికార్డులు అప్పగించకుండా చేయడంతో పాటు, ఇదే కారణం చూపిస్తూ కొందరు తన చెక్‌పవర్‌ను రద్దు చేయించారని, దీనిపై న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

క్రమబద్ధీకరించుకోకుంటే రిజిస్ట్రేషన్లు ఆపేస్తాం

● పీకేఎం ఉడా చైర్మన్ సురేశ్‌బాబు



మాట్లాడుతున్న పీకేఎం ఉడా చైర్మన్

మదనపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్లాన్ లేకుండా నిర్మించిన భవనాలు, అనుమతికి మించి ఎక్కువగా నిర్మించిన, డీవియేషన్ అయిన నిర్మాణాలను (బీపీఎస్) క్రమబద్ధీకరించుకోవాలని పీకేఎం ఉడా చైర్మన్ బి.ఆర్.సురేష్‌బాబు తెలిపారు. స్థానిక పీకేఎం ఉడా కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ అప్రూవల్ లేకుండా వేసిన లేఅవుట్లను కూడా క్రమబద్ధీకరించుకోవాలని ఇందుకోసం ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. లబ్ధిదారులు సకాలంలో దరఖాస్తు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ తరహాలో ప్రభుత్వం ప్రజలకు మంచి అవకాశం కల్పించిందన్నారు. ఇలాంటి పథకాలు మళ్లీ మళ్లీ రావని, ఇదే చివరి అవకాశం కావచ్చని తెలిపారు. ఎల్ఆర్ఎస్ పథకానికి ఇప్పటికే గడువు ముగిసినా ప్రభుత్వం మళ్లీ మూడు నెలలు పొడిగించిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పటికీ వినియోగించుకోకుంటే అనధికార లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు ఆపేస్తామన్నారు. ఆయా లేఅవుట్‌కు సంబంధించి మున్సిపాలిటీలో కమిషనర్, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోల నుంచి లేఅవుట్ సర్వేనంబర్లు తీసుకుని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు ఆపేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఆ లేవుట్‌లలో ప్లాట్లు కొనొద్దు..అమ్మొద్దంటూ బోర్డులు కూడా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. సమావేశంలో టౌన్ బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, టీడీపీ సీనియర్ నేత కోపూరి మల్లికార్జుననాయుడు, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, ఉడా కార్యదర్శి పి.ఆర్.మనోహర్, ప్లానింగ్ అధికారి సంధ్యారాణి, అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి మధుసూదన్, కుప్పం మున్సిపల్ చైర్మన్ సెల్వం, టీడీపీ నాయకులు ఆర్.నీలకంఠ, ఆర్.సోమశేఖర్, పూల మురళి, తదితరులు పాల్గొన్నారు.

గురి చూసి కొట్టాలి...

● పోలీసులకు ఫైరింగ్ ప్రాక్టీస్



ఫైరింగ్ ప్రాక్టీస్‌పై అవగాహన కల్పిస్తున్న ఆర్ఐ రామకృష్ణ

రాయచోటిటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా పౌరుల భద్రత కోసం నిత్యం పనిచేసే పోలీసు శాఖ తన సిబ్బందిని అత్యంత పదునుగా ఉంచేందుకు వార్షిక ఫైరింగ్ ప్రాక్టీసును ప్రారంభించింది. ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు మంగళవారం సివిల్ పోలీసు అధికారులదరికీ తుపాకీ వాడకంలో మెలకువలను నేర్పించారు. ఈ సందర్భంగా కడపలోని జేఎంజే కళాశాల సమీపలోని రాజీవ్ స్మృతి వనం వద్ద ఉన్న పోలీసు ఫైరింగ్ రేంజ్‌లో ఈ శిక్షణ జరిగింది. ఆర్ఐ (అడ్మిన్) వీజే రామకృష్ణ దగ్గరుండి ఫైరింగ్ ప్రాక్టీస్ శిక్షణను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆర్ఐ రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తప్పక నిర్వహించే ఈ ఫైరింగ్ ప్రాక్టీస్‌లో గానీ, ఆత్మరక్షణకు, ప్రజల రక్షణ మనం తీసుకునే చర్యలను వివరించారు. శిక్షణలో పాల్గొనే ప్రతి ఒక్కరూ తమ తుపాకీ వాడకంపై ఉన్న చిన్నపాటి అనుమానాలను కూడా నివృత్తి చేసుకుని గురిని మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. అనంతరం ఆర్ఎస్ఐలు శ్రీనివాసులు, అమర్‌నాథరెడ్డిలు తుపాకీ ని ఎలా పట్టుకోవాలి, ఎప్పుడు కాల్చాలి అనే విషయాలపై సిబ్బందికి వివరంగా నేర్పించారు. ప్రాక్టీస్‌లో సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ



వరి కోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయాధికారులు

గాలివీడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ఉండాలన్న సదుద్దేశ్యంతో ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని నూలివీడులో నిర్వహించిన వరి పంట కోత ప్రయోగం, పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలను అందించే విధంగా ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని, రైతులు తమ పంటను కనీసం మద్దతు ధర కన్నా తక్కువకు అమ్ముకోవాల్సిన అవసరం లేదని తెలియజేశారు. అంతేగాకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతన్నలకు అదనపు సౌకర్యాలు కల్పిస్తుందని, ఉచిత గోనె సంచులు సరఫరా, లేబర్ చార్జీలు, రవాణా ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సిబ్బందితో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

కడప-రేణిగుంట రోడ్డు పనులు ప్రారంభం

● భూమిపూజ చేసిన నేతలు
● శరవేగంగా రోడ్డు మరమ్మతు పనులు



నితిన్‌గడ్కరీ, పురందేశ్వరి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

రాజంపేట/పుల్లంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్లుగా ఊరిస్తున్న కడప-రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు పనులు ఎట్టకేలకు మంగళవారం ప్రారంభమయ్యాయి. రోడ్డు పునరుద్ధరణ పనులకు మంగళవారం రాజంపేట బీజేపీ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేశ్, కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి కలసి పుల్లంపేట సమీపంలోని ఆంజనేయస్వామి పుట్ట వద్ద భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ ఈ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లుగా కడప-రేణిగుంట ఎన్‌హెచ్-716 రహదారి విస్తరణ అభివృద్ధి పనులు ఆగిపోయాయన్నారు. దీంతో ప్రమాదాలు కూడా ఎక్కువయ్యాయని, ఈ విషయాన్ని కేంద్ర మంత్రి గడ్కరీ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించి రూ.100 కోట్లు విడుదల చేశారని తెలిపారు. ముఖ్యంగా ఈ రోడ్డు విస్తరణకు ఎంపీ పురందేశ్వరి ఎంతగానో కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గడ్కరీ, పురందేశ్వరి చిత్రపటాలకు కూటమి నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రశేఖర్‌నాయుడు, దాసరి వాణి, రాజు, మండల బీజేపీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇటీవలే కోడూరు నుంచి తిరుపతి వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఈ సమయంలో ఈ నిధులు రావడంతో యుద్ధప్రాతిపదికన డబల్‌లైను రోడ్డును పునరుద్ధరిస్తున్నారు. భారీ యంత్రాలను ఏర్పాటు చేసి సంబంధిత కాంట్రాక్టర్ల ద్వారా రేణిగుంట నుంచి రాజంపేట వరకు రోడ్డు పనులను శరవేగంగా ప్రారంభించారు. దెబ్బతిన్న చోట్ల తారురోడ్డు వేస్తున్నారు. నెలరోజుల్లోపు దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేయనున్నారు. మిగిలిన చోట్ల రోడ్డును వెడల్పు చేస్తారు. దీనివల్ల కడప-తిరుపతి వాసులకే కాకుండా చెన్నై, ఇటు ముంబాయి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, బళ్లారి, మహారాష్ట్ర ప్రయాణికులకు ప్రయాణం సులభతరవుతుంది. ప్రధానంగా తిరుమలకు, చెన్నైకి వెళ్లే దక్షిణాది రాష్ట్రాల ప్రజలకు ఈ రోడ్డు ఎంతో ఉపకరిస్తుంది.

అదృశ్యమైన వ్యక్తి శవమై తేలాడు...



ఆనంద (ఫైల్)

పీలేరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 5వ తేదీన అదృశ్యమైన ఓ వ్యక్తి శవమై తేలిన సంఘటన మంగళవారం పీలేరులో వెలుగు చూసింది. పీలేరు పోలీసుల కథనం మేరకు పీలేరు పట్టణం కోటపల్లెకు చెందిన బి.ఆనంద (40) ఈనెల 5వ తేదీన మధ్యాహ్నం 3 గంటల నుంచి కనిపించకుండా పోయాడు. ఆరోజు, మరుసటి రోజు అతని కోసం వెతికిన అతడి భార్య బి.రాధ, అతను కనిపించడం లేదని ఈనెల 7న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం తిరుపతి మార్గంలోని జీవన్ చెరువులో ఓ శవం తేలియాడుతూ కన్పించినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఆ శవాన్ని గమనించిన పోలీసులు, కుటుంబసభ్యులు, స్థానికులు అది ఆనంద్ శవంగా నిర్ధారించారు. పోలీసులు ఆనంద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని మృతికి గల కారణాలను విచారిస్తున్నారు.


ప్రార్థనకు ముందే పాఠశాలలో ఉండాలి



టీచర్లతో మాట్లాడుతున్న డీఈఓ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉపాధ్యాయుడు పాఠశాల ప్రార్థన సమయానికి ముందే పాఠశాలలో ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్ ఆదేశించారు. మంగళవారం కడప నగరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల జయనగర్ కాలనీ, నగర పాలక ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాల, నగర పాలక ఉర్దూ బాలికల ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమయపాలన లేని ఉపాధ్యాయులకు షోకాజ్ అందజేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు. ఎస్ఎస్‌సీ 100 రోజుల యాక్షన్‌ప్లాన్ జిల్లాలోని ప్రతి పాఠశాల తప్పనిసరిగా అమలు కావాలన్నారు. ప్రతి పాఠశాలలో డ్రాపౌట్స్, లాంగ్ ఆబ్సెంటీస్ లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు భాగ్యవతి, విజయలక్ష్మి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు మునీర, సీఆర్‌ఎంటీ శంకర్, కృష్ణ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని సందర్శించిన హంపీ పీఠాధిపతి



దువ్వూరులో అమ్మవారి ఆలయంలో విరూపాక్ష విద్యారణ్యస్వామి

దువ్వూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులోని కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని మంగళవారం హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్యస్వామి సందర్శించారు. ఆయన రాక సందర్భంగా ఆర్యవైశ్యులు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. నేరుగా ఆయన ఆలయంలోకి వెళ్లి అమ్మవారికి స్వయంగా హారతి ఇచ్చి దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయంలో కొంతసేపు సేద తీరారు. ఈ సందర్భంగా పీఠాపతిని చూసేందుకు భక్తులు తరలివచ్చారు. ఆలయాలను సందర్శన చేస్తూ ఆయన ఇక్కడికి వచ్చినట్లు స్థానిక అర్చకుడు మూర్తిస్వామి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు లింగం పట్టాబి, అధ్యక్షుడు ఆరవేటి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు యాదాల రామకృష్ణ, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూముల్లో పనులను అడ్డుకున్న అధికారులు





వివాదాస్పద భూముల్లో మట్టి తోలుతున్న దృశ్యం, అడ్డుకున్న పోలీసు, రెవెన్యూ సిబ్బంది

కాశినాయన డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మూలపల్లె సర్వేనెంబర్ 1లోని భూములు వివాదస్పదంగా మారాయి. రెవెన్యూ అధికారులు అనుమతి లేకుండా యంత్రాల సాయంతో గంగనపల్లె గ్రామానికి చెందిన కొందరు చెట్లు పీకడం, భూములు చదును చేయడం, మట్టి తోలడం వంటి పనులు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న నర్సాపురం గ్రామస్థులు మంగళవారం ఈభూములు మావంటూ యంత్రాలతో చెట్లు తొలగించే ప్రయత్నం చేశారు. వీరిని గంగనపల్లెకు చెందిన వారు అడ్డుకున్నారు. దీంతో వీరి మధ్య ఘర్షణకు దారి తీసింది. నర్సాపురం వాసులు రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగప్రవేశం చేసి పనులను నిలుపుదల చేయించారు. ఈవిషయంపై డిప్యూటీ తహశీల్దారు రవిశంకర్‌ను వివరణ కోరగా... ఇరు గ్రామాల వారి వద్ద ఉన్న ఆధారాలతో కార్యాలయానికి రావాలని తెలిజేశామన్నారు.

స్థలం వివాదంతో వ్యక్తి మృతి

ఖాజీపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థలం వివాదంతో పురుగులమందు తాగి పోటుగంటి హుస్సేన్ (80) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని దుంపలగట్టు గ్రామానికి చెందిన హుస్సేన్ గత కొన్ని సంవత్సరాలుగా దుంపలగట్టులో నివాసం ఉంటున్నారు. ఆయన స్థలాన్ని అదే గ్రామానికిచెందిన మరో వ్యక్తి ఆక్రమించడంతో పలు మార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఆదివారం రాత్రి పురుగులమందు తాగి తలుపులు వేసుకున్నాడు. ఉదయం తలుపు తీయకపోవడంతో భార్య గమనించి చుట్టుపక్కలవారిని పిలువడంతో అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించి, మృతుడి కుమారుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వంశీధర్ తెలిపారు.

కాగా, స్థలం వివాదం విషయం తమ దృష్టికి రాలేదని, తెలిసిన వెంటనే అక్కడ జరుగుతున్న పనులను ఆపివేశామని తహసీల్దారు రమణమ్మ తెలిపారు. కాగితాలు తీసుకురావాలని చెప్పడం జరిగిందని తహసీల్దారు రమణమ్మ అన్నారు. ఎక్కడైనా భూ సమస్యలుంటే మా దృష్టికి తీసుకురావాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్రొద్దుటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఇతను రెండు రోజుల క్రితం అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందాడని ఆసుపత్రి ఔట్ పోస్టు హెడ్‌కానిస్టేబుల్ షబ్బీర్ తెలిపారు. ఆసుపత్రి రికార్డుల్లో అతని పేరు రవి (40), తండ్రి పుల్లయ్య, రామేశ్వరం అని వివరాలు ఉన్నాయన్నారు. శవాన్ని మార్చురీలో ఉంచారని, అతనికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే మృతదేహాన్ని గుర్తించి తీసుకెళ్లాలని కోరారు.

కోర్టు భవనానికి రూ.9.20 కోట్లు మంజూరు

కలికిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని కమలాపురం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నూతన భవన నిర్మాణాలకు రూ.9.20 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. అమల్లో వున్న నిర్మాణ నిబంధనల మేరకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా హైకోర్టు రిజిస్ట్రారు (పరిపాలన)ను కోరుతూ న్యాయ, శాసన వ్యవహారాలశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి మంగళవారం పాలనాపరమైన మంజూరు ఉత్తర్వులను జారీ చేశారు. ఆర్థిక శాఖ అనుమతులు కూడా పొందినట్లు అందులో పేర్కొన్నారు.

బైకుల చోరీకి పాల్పడే ముగ్గురు అరెస్టు

- అరెస్టయిన వారిలో ఒకరు మైనరు
- 18 బైకులు స్వాధీనం
- కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ నచికేత్



మాట్లాడుతున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో పార్కింగ్ చేసిన బైకులను చోరీ చేసే ముగ్గురు వ్యక్తులను కడప వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు, సీఐ చిన్నపెద్దన్న, ఎస్ఐ అమర్‌నాథరెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కడప నగరం రవీంద్రనగర్‌కు చెందిన సయ్యద్ గౌస్ బాషా, షేక్ మహబూబ్ బాషా, వేల్పుల రవీంద్ర ఆలియాస్ మహేంద్రలు మరో బాలుడుతో కలిసి వన్ టౌన్ పరిధిలో 11, తాలుకా పోలీసుస్టేషను పరిధిలో 2, సీకేదిన్నె, కడప రిమ్స్ పోలీసుస్టేషన్ పరిధిలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహ నాలను చోరీలకు పాల్పడేవారని తెలిపారు. వీరిపై వన్‌టౌన్ సీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంతో నిఘా పెట్టామన్నారు. ఈ నేపధ్యంలో దొంగతనం చేసిన బండ్లను వేరే ప్రాంతాలకు తీసు కుపోతున్నట్లు సమాచారం రావడంతో మోచంపేట సర్కిల్ వద్ద దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశారన్నారు. ప్రధాన నిందితుడు వేల్పుల రవీంద్ర ఆలియాస్ మహేంద్ర పరారీలో ఉన్నాడని.. అతని కోసం ప్రత్యేక బృందం గాలింపు చర్య లు చేపట్టిందన్నారు. పట్టుబడిన వారి వద్ద నుంచి రూ.10లక్షలు విలువ చేసే వివిధ కంపెనీలకు చెందిన 18 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకు న్నట్లు తెలిపారు. ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేసిన ప్రాంతంలో సీసీ కెమె రాల ఆధారంగా నిందితులను గుర్తించామన్నారు. నిందితులను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన సీఐ చిన్న పెద్దన్న, ఎస్ఐలు అమర్‌నాథరెడ్డి, ప్రదీప్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. కాగా, చోరీల నియంత్రణకు ప్రజలు స్వచ్ఛం దంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ సూచించారు.



బైకులను పరిశీలిస్తున్న ఎస్పీ

అకడమిక్ కన్సల్టెంట్ల భాగస్వామ్యం అవసరం

- వైవీయూ వీసీ రాజశేఖర్



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ అభివృద్ధిలో అకాడమిక్ కన్సల్టెంట్ల భాగస్వామ్యం అవసరమని వైస్ చాన్సలర్ రాజశేఖర్ తెలిపారు. జాతీయస్థాయి ర్యాంకులు పొందడంలో అకడమిక్ కన్సల్టెంట్ల పాత్ర కూడా కీలకమని చెప్పారు. మంగళవారం వైవీయూలో అకడమిక్ కన్సల్టెంట్లతో సమావేశమై మాట్లాడుతూ ప్రతి అకడమిక్ కన్సల్టెంట్ మల్టీ డిసిప్లినరీ సబ్జెక్టుల్లో విజ్ఞానాన్ని పొందాలని, బలమైన బయోడేటాను రూపొందించుకోవాలన్నారు. సబ్జెక్టుల్లో విస్తృత జ్ఞానాన్ని పొందడమే కాకుండా, పరిశోధనా పత్రాలను ఎక్కువగా రాయాలని, విశ్వవిద్యాలయం పేరుతో వాటిని ప్రచురించాలన్నారు. బోధనా నైపుణ్యాల్ని పెంపొందించుకోవాలని సూచించారు. 110 జీఓను అమలు చేయడానికి ప్రయత్నిస్తామన్నారు. ఎన్‌పీటీఈఎల్ స్వయంవంటి టీచింగ్ ప్లాట్‌పామ్‌ల ద్వారా నిరంతరం కోర్సులు చదువుతూ జ్ఞానాన్ని పెంచుకోవాలన్నా రు. బోధనపరిశోధన సామర్థ్యాలు మెండుగా ఉన్నప్పుడు అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. విశ్వవిద్యాలయం అప్పజెప్పిన బాధ్యతలను జాగ్రత్తగా నిర్వర్తించాలని సూచించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ కూడా పలు సూచనలు చేశారు. అకడమిక్ కన్సల్టెంట్ హరినాథ్‌రెడ్డి, వీరప్ప, వెంకటేష్, రమణ, దామోదర్,మానస పలు సమస్యలను ఉపకులపతి దృష్టికి తెచ్చారు. సమావేశంలో అకడమిక్‌కన్సల్టెంట్లు పాల్గొన్నారు.

స్కాలర్లు యూజీసీ నెట్ అర్హత సాధించాలి

విశ్వవిద్యాలయంలోని ప్రతి స్కాలర్ యూనివర్సిటీ గ్రాంట్‌కమీషన్ నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్) అర్హత సాధించాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ ఆకాంక్షించారు. మంగళవారం యోగి వేమన విశ్వవిద్యాలయంప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఉచ్చరత శిక్ష అభియాన్ సహకారంతో జరుగుతున్న యూ జీసీ, సీఎస్ఐఆర్‌నెట్ శిక్షణ తరగతులకు ఆయన హాజరయ్యారు. బోధన వైఖరులు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధి స్తే లెక్చరర్ షిప్‌నకు అర్హత లభిస్తుందన్నారు. నిత్యం సాధన చేయాలని సూచించారు. ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య విజయ భారతి, స్కాలర్లు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని త్వరితగతిన పూర్తి చేస్తాం



కోటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రంథాలయ సిబ్బంది

కడప మారుతీనగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిర్మాణ దశలో ఊగిసలాడుతున్న జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ జి.కోటేశ్వరరావు స్పష్టం చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం కడపకు విచ్చేసిన కోటేశ్వరరావు కడపలో నిర్మాణ దశలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయం నిర్మాణానికి వీలుగా ప్రభుత్వం తరపున కోటి రూపాయలు మంజూరు చేసిందన్నారు. త్వరితగతిన నిర్మాణ పనులు జరిగేలా చూడాలని ఆదేశాలిచ్చారు. అంతకుముందు నగర కొండాయపల్లెలో గల జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు కావలసిన తెలుగు అకాడమీ పుస్తకాలను, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు కావలసిన కాంపిటేషన్ పుస్తకాలను అందుబాటులో వుంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.రామకోటిరెడ్డి, డిప్యూటీ లైబ్రేరియన్ పవన్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ రాజకుమార్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు కానిస్టేబుల్ ఎంపిక



కానిస్టేబుల్ మహబూబ్‌బాషను అభినందిస్తున్న డీఎస్పీ

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో జరగనున్న తైక్వాండో హరామ్సే పోటీలకు ప్రొద్దుటూరు ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్‌పీ మహబూబ్‌బాష ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం డీఎస్పీ భావన తన కార్యాలయంలో కానిస్టేబుల్ మహబూబ్‌బాషను అభినందించారు. నవంబరులో కాకినాడలో జరిగిన 14వ రాష్ట్రస్థాయి తైక్వాండో హరామ్సే పోటీల్లో పాల్గొని బంగారు పతకాన్ని సాధించారు. దీంతో జాతీయస్థాయి పోటీలకు మహబూబ్‌బాష ఎంపికయ్యారు. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు హైదరాబాదులోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో జరుగనున్న జాతీయస్థాయి పోటీలలో పాల్గొనను న్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ భావన మాట్లాడుతూ జాతీయస్థాయిలో కూడా మంచి ప్రతిభను కనపరిచి పతకాన్ని సాధించాలని అభిలషించారు. మహబూబ్‌బాష ఎంపికపట్ల ట్రాఫిక్ సీఐ రాజగోపాల్, స్టేషన్ సిబ్బంది అభినందించారు.

దేశాభివృద్ధిపై మాత్రమే చట్టసభల్లో చర్చ జరగాలి

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో దేశం అభివృద్ధి చెందే విధంగా రాజ్యాంగాన్ని అనుసరించి చర్చలు జరగాలే తప్ప అనవసర విషయాలు, మతోన్మాద ఉద్రిక్తతలను రెచ్చగొట్టే విధంగా చర్చ ఉండకూడదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు హరినాథరెడ్డి హితవు పలికారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి వైపు దూసుకుపోతోందని ప్రచార ఆర్భాటమే తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. మంగళవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యతో దేశ ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నమైందని, దానిపై చర్చను కోరుతుంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కూటమి ప్రభుత్వం ప్రజలకు అవసరం లేని వాటిపై చర్చించాలని ఆర్డర్ వేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఎన్నికల ముందు బీహార్ రాష్ట్రంలో 60లక్షల మంది ఓటర్లను తొలగించే విషయంలో పెద్దకుట్ర జరిగిందన్నారు. ఒకపక్క రూపాయి విలువ పతనమవుతుంటే దాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్ సమర్థించడం ఎంత మాత్రం సబబన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రూ.కోట్లల్లో అప్పులు చేస్తోందని, ఇవన్నీఎక్కడ ఖర్చు చేస్తున్నది ప్రజలకు తెలపాలన్నారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందలేదని, దీనిపై రాష్ట్రంలోని జిల్లాల మార్కెట్ యార్డులు, ఎంపీలు, ఎమ్మెల్యేల ఇళ్ల ముందు ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 18న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా సభ్యులు ఎల్.నాగసుబ్బారెడ్డి, ఎన్.వెంకటశివ, గుంటి వేణుగోపాల్ పాల్గొన్నారు.

సిగటోక తెగులు నివారణకు చర్యలు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రవీంద్ర

వేంపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మండలం బక్కన్నగారిపల్లెతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో అరటి పంటకు సిగటోక ఆకుమచ్చ తెగులు సోకడంతో శాస్త్రవేత్తలు పరిశీలించి, రైతులకు నివారణ చర్యలు సూచించారు. మొదట పంటలను పరిశీలించిన కొవ్వూరు అరటి పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్ర, ఏడీఏ రవిచంద్రలు రైతులతో సమావేశం నిర్వహించారు. అరటిలో ఎరువులు, మొక్కలు నాటిన ఇరవై రోజుల నుంచి వేయాలన్నారు. ఏడునెలల వరకు అరటికి వేయాల్సిన ఎరువులు, మిశ్రమాల గురించి వివరించారు. ప్రధానంగా సిగటోక ఆకుమచ్చ తెగులు నివారణకు క్లోరోతలోనిల్ లీటర్‌కు రెండు గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. మచ్చలు కనిపించిన ఆకులపై ప్రొపోకొనాజోల్ మినరల్ ఆయిల్ తగిన మోతాదులో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఇలా పూర్తి స్థాయిలో అధికారుల సూచన మేరకు మందులు వాడాలని తెలిపారు. అరటి గెలలకు మొగ్గ ఇంజక్షన్లు, తొడుగులు వేసుకున్నట్లయితే రూ.25,500 ఇస్తారని, తద్వారా కాయ నాణ్యత లభిస్తుందని తెలిపారు.

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి బాబాపక్రుద్దీన్

కడప రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాలల భవిత కేంద్రం, జిల్లా సత్వర చికిత్స కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాపక్రుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం కడప రిమ్స్ ఆవరణలోని జిల్లా బాలల భవిత కేంద్రం, జిల్లా సత్వర చికిత్స కేంద్రాలను జడ్జి విజిట్ చేసి న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పుట్టినప్పటి నుండి 18 సంవత్సరాలు లోపుగల పిల్లలకు పుట్టుకతో వచ్చే ఎదుగదల లోపాలకు సంబంధించిన తల్లిదండ్రులు ఇలాంటి చికిత్స సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రత్యేక పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రత్యేక పిల్లులు కూడా ఉన్నత స్థానాలను అదిరోహిస్తున్నారన్నారు. వీరి కోసం జాతీయ న్యాయసేవాధికార సంస్థ బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయసేవల పథకం 2024 ప్రవేశపెట్టిందన్నారు. వికలాంగుల హక్కుల చట్టం 2016, మానసిక ఆరోగ్యం సంరక్షణ చట్టం 2017, జాతీయ మానసిక ఆరోగ్య విధానం 2014, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్‌లైన్ 1098, ఉచిత న్యాయ సహాయం తదితర అంశాలను తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సుభాష్ యాదవ్, బాలల భవిత కేంద్రం డాక్టర్లు, పారాలీగల్ వాలంటీర్లు, తల్లిదండ్రులు, ప్రత్యేక పిల్లలు పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి



ప్రజాగ్రహం తప్పదు!

● విద్యార్థి సంఘాల హెచ్చరిక ● రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని ఆటో డ్రైవర్ల ర్యాలీ

రాజంపేట: పాతబస్టాండు కూడలిలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు



రైల్వేకోడూరు: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



నాలుగో రోజు దీక్షలో పాల్గొన్న జేఏసీ నాయకులు

రైల్వేకోడూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాజంపేటను జిల్లా కేంద్రం చేయకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని కేఎస్‌యూఎఫ్ (కోడూరు స్టూడెంట్ యూనియన్ ఫోర్స్) వ్యవస్థాపక అధ్యక్షుడు బండారు మల్లికార్జున, ఆటో డ్రైవర్ల యూనియన్ నేత శంకరయ్య హెచ్చరించారు. మంగళవారం రైల్వేకోడూరు పాత బస్టాండు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి రెవెన్యూశాఖ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేటను జిల్లా కేంద్రం చేసినంత వరకు ఉద్యమాలు ఆగవని తెలిపారు. రాయచోటి వద్దు.. రాజంపేట ముద్దు అన్న నినాదం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి వినపడే విధంగా ఆందోళన చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకుడు మల్లెం హేమంత్, కేఎస్‌యూఎఫ్ ఉపాధ్యక్షుడు హస్తి భరత్‌కుమార్‌రాజు, కార్యదర్శి జెట్టి హరీష్, ఓబులవారి పల్లె మండల కన్వీనర్ గంగరాజు సునీల్‌వర్మ, ఆటో డ్రైవర్లు సరేంద్ర, మణి, చాంద్‌బాషా, చంగల్‌రాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ర్యాలీ, ధర్నా

రాజంపేట: రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలన్న డిమాండ్‌తో విద్యార్థులు మంగళ వారం జేఏసీ ఆధ్వర్యంలో పాతబస్టాండు కూడలిలో రోడ్డును దిగ్బంధం చేశారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని విద్యార్థులతో ఆందోళన విరమింపజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు లక్ష్మీనారాయణ, ప్రభాకర్‌నాయుడు, పూల విజయభాస్కర్, చిట్వేలి రవికుమార్, అబూబకర్ మాట్లాడుతూ రాజంపేట జిల్లా సాధించేవరకు ఈ ఆందోళనను విరమించబోమన్నారు. బుధవారం నుంచి జేఏసీ ఆధ్వర్యంలో రిలే దీక్ష శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాజంపేట, రైల్వే కోడూరు నియోజవర్గాల పరిధిలోని మండల నాయకులతో మాట్లాడి ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు డాక్టర్ నవీన్, ఈశ్వరయ్య, చల్లా సుధాకర్‌బాబు, డీఎస్‌రావు, సుధాకర్‌బాబు, ప్రకాష్ తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు. రాజంపేట ఆర్ అండ్ బీ బంగళా ముందు మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి ఆధ్వర్యంలో చేస్తున్న రిలే దీక్షలు నాలుగో రోజుకు చేరాయి. బుధవారం ఈయనకు మద్దతుగా పలువురు దీక్షల్లో పాల్గొన్నారు.

నాలుగో రోజుకు చేరిన నిరాహార దీక్షలు

ఒంటిమిట్ట: ఒంటిమిట్టను కడపజిల్లాలోనే ఉంచాలని జేఏసీ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నాలుగో రోజుకు చేరాయి. నాలుగోరోజు అయిన మంగళవారం నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒంటిమిట్టను కడపజిల్లాలోనే ఉంచాలన్నారు. లేకుంటే రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు అడ్వకేట్ రామదాసు, పాటూరు గంగిరెడ్డి, మంటపంపల్లె ఎంపీటీసీ సుంకేసుల బాషా, మంటపంపల్లె బాషా, కట్టా యానాదయ్య, మాడా వెంకట సుబ్బయ్య, కొత్తపల్లె మురళీమోహన్, రఘురామిరెడ్డి, శ్రీహరి, కత్తి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా బంద్

సిద్దవటం : మండలాన్ని కడప జిల్లాలోకి చేర్చకపోతే, రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలంటూ నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. విద్యా సంస్థలు, దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేసి బంద్‌కు ముక్తకంఠంతో ప్రజలు మద్దతు పలికారు. ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులు, యాజమాన్యం, గ్రామ ప్రజలు పార్వతిపురంలోని శీతలగంగమ్మకు పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలను కడపలోనే కొనసాగేలా పాలకుల బుద్ధి మార్చాలని వినతిపత్రం సమర్పించారు. రాయచోటి వద్దు కడప ముద్దు అనే నినాదంతో హోరెత్తించారు. అనంతరం సిద్దవటం బస్టాండు నుంచి పోలీసుస్టేషన్ మలుపు వరకు దుకాణాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాలు మూసివేశారు. పెద్దఎత్తున మహిళలు, గ్రామస్థులు, జేఏసీ నాయకులు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, మరికొందరు పాల్గొన్నారు.



సిద్దవటం: శీతల గంగమ్మకు వినతిపత్రం సమర్పిస్తున్న బంద్ నిర్వాహకులు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

పుల్లంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేట మండలంలో మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఐదుగురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. పుల్లంపేటకు చెందిన చిన్నారి వర్షిక కృష్ణకు రూ.30,786, అనంతయ్యగారిపల్లెకు చెందిన ప్రభావతికి రూ.43 వేలు, కొత్తపేటకు చెందిన సుబ్బమ్మ రూ.33,800, సాధువారిపల్లెకు చెందిన శాంతమ్మకు 25041, ఎగువరెడ్డిపల్లెకు అరుంధతివాడకు చెందిన మల్లీశ్వరికి 30785 రూపాయల చెక్కులను వారివారి ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి, చంద్రశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పూత దశలో సస్యరక్షణతో మంచి దిగుబడులు



మామిడి తోటలో రైతులతో మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి సింధూరి

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మామిడిలో పూత దశలో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు పొందవచ్చునని ఉద్యానవనశాఖ అధికారి సిందూరి తెలిపారు. మంగళవారం మండలంలోని బీసీ నాగిరెడ్డిపల్లెలో మామిడి తోటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ అక్టోబరు, నవంబరు మాసాల్లో కొమ్మల కత్తిరింపులు, ఎరువులు వేయాలన్నారు. డిసెంబరు నుంచి మొగ్గ ఏర్పడుతుందని, ఇది కొమ్మ చివరి భాగంలో ఉబ్బినట్లుగా కనిపిస్తుంది. అనుకూలమైన వాతావరణ పరిస్థితి ఉన్నప్పుడు ఈ మొక్క నుంచి పూత బయటకు వస్తుందని, కాబట్టి పూత దశలోనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. 22, 24 డిగ్రీల సెంటిగ్రేడ్ అనుకూలమైన వాతావరణం అనుకూలంగా ఉన్నప్పుడే పూత బయటకు వస్తుందన్నారు. పూత రాని పక్షంలో 1.2 మి.మీటర్ల సైకోసెల్ ద్రావణం పిచికారీ చేయాలన్నారు. పదేళ్లు పూర్తయిన చెట్లకు నత్రజని భాస్వరం, పొటాషియం ఇచ్చే ఎరువులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి



ప్రజలతో మాట్లాడుతున్న మదన్‌మోహన్

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మండల టీడీపీ అధ్యక్షుడు యనమల మదన్‌మోహన్ తెలిపారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం దిన్నెపాడు పంచాయతీలోని నరసింహ రాజుగారిపల్లె, పర్వతరెడ్డిగారిపల్లె, బెస్తపల్లి, దిన్నెపాడు గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా బెస్తపల్లిలోని హరిజనవాడలో వీధి లైట్లు, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మదన్‌మోహన్ మాట్లాడుతూ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే సీసీ రోడ్లు, వీదిలైట్లు, తాగునీటి సమస్య, రోడ్లు ఏర్పాటు చేస్తామని ప్రజలు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శంకరపు జయరాం, లక్కిరెడ్డిపల్లె సింగిల్‌విండో అధ్యక్షుడు వీరబల్లి లక్ష్మీరాజు, చెరువు సంఘం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, దళిత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులేసు, టీడీపీ నాయకులు ఓబులేసు, సంజీవరాజు, వెంకట్రమణ, హనుమంతు, రామాంజనేయులు, గంగరాజు, సురేంద్రరాజు, వీరయ్య, సీఎం రాజు, వెంకట్రామరాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏకిరపల్లెకు రోడ్డు వేయాలి

● పీఆర్ కమిషనర్‌కు పోతుగుంట వినతి



పీఆర్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న పోతుగుంట రమేశ్‌నాయుడు, లంకా దినకర్

రాజంపేట టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అటవీ కుగ్రామమైన ఏకిరిపలెకు రోడ్డు వేయాలని కోరుతూ శ్రీశైలం దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు మంగళ వారం 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్‌తో కలిసి పంచాయతిరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ కృష్ణతేజకు వినతిపత్రం అందజేశారు. రోడ్డు లేక ఏకిరిపల్లె గ్రామస్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఎ విద్య, వైద్య ఇతర సౌకర్యాలకు నోచుకోలేకపోతున్నారని కమిషనర్‌కు వివరించారు. ఈ విషయంపరిశీలిస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

నేడు వ్యాస రచన, క్విజ్ పోటీలు

పెనగలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌శాఖ పొదుపు వారోత్సవాలను పురస్కరించుకుని రాజంపేట, మన్నూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో9, 10 చదివే విద్యార్థులకు బుధవారం పోటీ పరీక్ష నిర్వహిస్తున్నట్లు, పెనగలూరు మండల ఏఈ ఆర్.ఓబుల్‌రెడ్డి తెలిపారు. విద్యుత్‌శాఖ- ఇందనం పొదుపు - లాభనష్టాలు, సత్ఫలితాలు తదితర అంశాలపై వ్యాసరచన, క్విజ్ పోటీలు ఉంటాయయన్నారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 10 గంటలకల్లా మన్నూరు హైస్కూల్‌కు చేరుకోవాలన్నారు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి



డీఈవోకు వినతి పత్రం సమర్పిస్తున్న బీటీఏ నాయకులు

రాయచోటి నేతాజీ సర్కిల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పల్లం రామచంద్ర మంగళవారం జిల్లా విద్యాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 362 ప్రకారం ఎస్సీ, ఎస్టీ, ఎస్‌జీటీ ఉపాధ్యాయులు బీఈడీ కోర్సులో చేరేందుకు అనుమతించాలని కోరారు. గత సంవత్సరం పదవ తరగతి మూల్యాంకన విధుల్లో పాల్గొన్న పలువురు ఉపాధ్యాయులకు ఇప్పటికీ పారితోషికం అందలేదన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో పరీక్ష పేపర్ల మూల్యాంకనానికి తగినంత సమయం ఇవ్వాలని, సాధారణ సెలవులు, పండుగ సెలవుల్లోనూ తరగతుల నిర్వహణ మినహాయించి ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన టీచర్స్ అసోసియేషన్ సహాధ్యక్షుడు ఏవీ రమణ, ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ జనరల్ షేక్. అబ్దుల్‌రజాక్ తదితరులు పాల్గొన్నారు.

మంగంపేటలో ఖనిజం లభ్యతపై సర్వే చేయించాలి

● రాష్ట్ర సీపీఐ కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య



పీపీఎం గోపినాథ్‌తో సమావేశమైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య

ఓబులవారిపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎటువంటి సర్వేలు లేకుండానే మంగంపేటలోని ఏపీఎండీసీ గనులు ఇంకా రెండేళ్లు మాత్రమే ఖనిజం లభ్యమవుతుందని పత్రికల్లో ప్రకటనలు చేయడంతో కార్మికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని భారత కమ్యూనిస్టుపార్టీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య అన్నారు. మంగళవారం మంగంపేటకు విచ్చేసిన ఆయనకు ఏపీఎండీసీ ఎంప్లాయిస్ యూనియన్ తరఫున సన్మానించారు. అనంతరం ఆయన సీపీవో గోపీనాథ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య మాట్లాడుతూ సాధారణంగా గనులకు పరిసర ప్రాంతాల్లో కూడా ఖనిజం ఉంటుందని, మంగంపేట పరిసర ప్రాంతాల్లో కోర్ డ్రిల్లింగ్ వేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో దాదాపు 60 లక్షల టన్నుల ఖనిజ నిక్షేపాలు ఉండగా.. ఒకటిన్నర సంవత్సరం మాత్రమే మైనింగ్ ఉంటుందని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. కార్మికుల శ్రేయస్సును, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని మైనింగ్ నార్మ్స్ ప్రకారం మైనింగ్ ప్రొడక్షన్, డిస్పాచ్ చేయాలన్నారు. ఏ గ్రేడ్ బెరైటీస్ ఖనిజానికి టెండర్లు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బెరైటీస్ ఖనిజానికి అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉన్నా కూడా ఒక్కొక్కరికి ఒక్కో రేటు ప్రకారం ఖనిజాన్ని విక్రయిస్తూ ద్వంద విధానాన్ని పాటిస్తూ కార్పొరేషన్ ఆదాయానికి గండికొట్టే పరిస్థితి తెచ్చిందన్నారు. ప్రతి టెండరులోను పారదర్శకత పాటించాలన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఔట్‌సోర్సింగ్, ట్రైనీ కార్మికులుగా పని చేస్తున్నవారి ఉద్యోగాల రెగ్యులైజేషన్ గురించి యాజ మాన్యంతో మాట్లాడి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని కార్మికులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, ఏపీఎండీసీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పోకూరు మురళి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగాధర్, సాంబశివ, భారత కమ్యూనిస్టుపార్టీ జిల్లా సెక్రటరి, జాయింట్ సెక్రటరి మహేష్, కృష్ణప్ప, ఏరియా కార్యదర్శి చిన్నయ్య, సహాయ కార్యదర్శులు టి.కృష్ణచైతన్య, పండుగోల మణి, రైల్వేకోడూరు మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్, అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు సరోజనమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల కార్యవర్గ సభ్యులు మునిశేఖర్, రామచంద్రయ్య, బత్తల హరి, భానుప్రకాష్, లక్ష్మీనారాయణ, కొట్టేడి సాయి, విజయకృష్ణ, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు ఆదినారాయణరెడ్డి, కార్మిక సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

రహదారి పనులు త్వరగా పూర్తి చేయండి



డీఈకి వినతి పత్రం అందజేస్తున్న మౌర్యారెడ్డి

సుండుపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాయచోటి- సుండుపల్లె రెండు వరుసల రహదారి పనులు త్వరగా పూర్తి చేయాలని టీడీపీ నేత మిన్నమరెడ్డి మౌర్యారెడ్డి కోరారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అధికారులను కలిసి మాట్లాడారు. రాయచోటి- రాజంపేట, రాయచోటి- సుండుపల్లె రహదారి పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం రూ.5.50 కోట్లు నిధులు విడుదల చేయడంతో త్వరగా టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి లెటర్ ఇచ్చారన్నారు. ం ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటసుబ్బయ్యను కోరినట్లు తెలిపారు. కాగా బుధవారం రాయచోటి-సుండుపల్లె పనులకు టెండర్లు ఆహ్వానించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

చిట్వేలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక భవిత కేంద్రంలో మంగళ వారం ప్రపంచ దివ్యాంగుల దినం సందర్భంగా ఎంఈవో ఈశ్వరయ్య, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గరాజు, సీనియర్ ఉపాధ్యాయుడు కామాటం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దివ్యాంగ పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాన్నారు. అనంతరం పిల్లలకు మహేశ్వరి క్యారీ బాక్సులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనారోగ్య పీడితులకు ఎల్‌వోసీ పత్రం వరం

చిన్నమండెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దిగువ గొట్టివీడుకు చెందిన రామకృష్ణ వైద్య ఖర్చుల కోసం ఎల్‌వోసీ పత్రాన్ని ఇప్పించమని మంత్రి మండిపల్లిని అభ్యర్థించారు. దీంతో ఆయన రూ.1.4 లక్షలకు సిఫారసు చేస్తూ లేఖ ఇచ్చారు. ఆపత్రాన్ని మౌర్యారెడ్డి, రామకృష్ణ వారికి అందజేశారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

రామాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక హరిహరాలయంలో మంగళవారం అయ్యప్ప భక్తులకు చరణ్‌రెడ్డి అన్నదాన చేశారు. ఈ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మద్దిరేవుల రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేద్దాం.. సత్ఫలితాలు సాధిద్దాం



కార్యకర్తలతో మాట్లాడుతున్న మూగి రెడ్డెప్ప

చిన్నమండెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమష్టిగా కృషి చేద్దాం.. సత్ఫలితాలు సాధిద్దాం అని మండల టీడీపీ అధ్యక్షుడు మూగి రెడ్డెప్ప పిలుపునిచ్చారు. మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీలోమంగళవారం టీడీపీ కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామాల అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. మండల టీడీపీ జనరల్ సెక్రటరీ చెన్నకృష్ణారెడ్డి, సెక్రటరీ ఖాదర్‌బాషా, గ్రామ అధ్య క్షుడు ప్రతాప్‌రెడ్డి, చిన్నరెడ్డి, అశోక్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా హౌసింగ్ రీ వెరిఫికేషన్ జరుగుతుందని తెలిపారు.

ఇకపై క్యూఆర్ కోడ్ ద్వారానే పన్ను చెల్లింపు..

● గ్రామాల్లో ప్రజలకు అవగాహన



ఇంటి పన్ను చెల్లింపులపై అవగాహన కల్పిస్తున్న కార్యదర్శి

ఒంటిమిట్ట/లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఇంటిపన్నును ప్రజలు క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించవచ్చునని ఒంటిమిట్ట పంచాయతీ కార్యదర్శి సుధాకర్, లక్కిరెడ్డిపల్లె ఈవోపీఆర్‌డీ ఉషారాణి మంగళవారం తెలిపారు. మండలంలోని పెద్దకొత్తపల్లె గ్రామంలో ఇంటి పన్నుల చెల్లింపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఇంటి పన్ను, నీటి పన్ను, కుళాయిపన్ను, లైసెన్సు ఫీజులు తదితరాలన్నీ ఇకపై క్యూఆర్ కోడ్ ద్వారా ఫోన్‌పే ఉపయోగించి చెల్లించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్, ట్రైనీ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఓబుల్‌రెడ్డి

ఓబులవారిపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏపీఎండీసీ ఔట్‌సోర్సింగ్, ట్రైనీ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబుల్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పోరాట కమిటీ జేఏసీ కన్వీనర్ ఆర్.వెంక టేశ్ ఏపీఎండీసీ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో మాయమాటలు చెప్పి ఇళ్లు, భూములు తీసుకుని కార్మికులుగా నియమించుకున్న వారి ఉద్యోగాలను రెగ్యులర్ చేయకుండా ఔట్‌సోర్సింగ్, ట్రైనీ పేరుతో దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. చట్టప్రకారం కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్ ఇవ్వకుండా యాజమాన్యం అడ్డుకోవడం దారుణమన్నారు. ఏపీఎండీసీ కార్మికులు చేసే పోరాటాలకు సీఐటీయూ రాష్ట్రకమిటీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, ఎంప్లా యీస్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ ఎం.శ్రీనివాసులు, వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరి జ్యోతి నాగరాజు, జేఏసీ కోకన్వీనర్ అరుణావతి, మంగంపేట మైనింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కార్మికులు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు

సుండుపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక మోడల్ (తెలుగు) పాఠశాల విద్యార్థులకు గురువారం దంత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ గంగిరెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మయ్యనాయుడు, అమ్మునాయక్ తెలిపారు. బుధవారం సుండుపల్లె వైశ్యబజారులో ఉన్న శ్రీస్కంద దంత వైద్యశాల డాక్టర్ ఉదయకాంత్, వైద్య పరీక్షలు చేయడంతోపాటు పేస్టు, బ్రష్ ఉచితంగా అందజేయనున్నారని తెలిపారు.

ఔషధ నియంత్రణ తనిఖీ కేంద్రం ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించిన మంత్రి సత్యకుమార్ యాదవ్



ఔషధ నియంత్రణ తనిఖీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని ఔషధ నియంత్రణ తనిఖీ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 11 ఔషధ నియంత్రణ తనిఖీ కేంద్రాలు, 2 ల్యాబ్‌లను ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అమరావతి నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డ్రగ్స్ నాణ్యత, ఎక్స్‌పైరీ తేదీలను తప్పక పరిశీలించాలన్నారు. ఆస్పత్రిలో అధికారులు ల్యాబ్‌లను, మందులు దుకాణాలను తనిఖీ చేయాలని సూచించారు. త్వరలో జనరిక్ మందుల షాపులను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అధికారులు వైద్య సేవలను సక్రమంగా అందించి రెఫర్ తగ్గించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జ్ మెడికల్ సూపరింటెండెంట్ కవిత, డ్రగ్స్ నియంత్రణ కేంద్రం అదనపు డైరెక్టర్ షేక్ ఆశ, మదనపల్లె, అనంతపురం డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు కలంధర్, కేశవరెడ్డి, మదనపల్లె మెడికల్ స్టోర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, జిల్లా కార్యదర్శి భూషణ్‌గుప్తా, మదనపల్లె కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి బాలాజీ, మదనపల్లె నేతలు మాలతి, మురళి, సత్యప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనులకు ప్రాధాన్యం : పీడీ



మాట్లాడుతున్న పీడి వెంకటరత్నం

కురబలకోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం వ్యవసాయరంగానికి దోహదపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు. మంగళవారం మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు లాభసాటి వ్యవసాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువుల షెడ్‌లు, పశుగ్రాసం, పండ్లతోటల పెంపకం మెటీరియల్స్ బిల్లులను వారం రోజుల్లోగా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగయ్య, ఏపీడీ నందకుమార్, ఏపీవో సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులపై దృష్టి పెట్టండి

తంబళ్లపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకంలో రైతులకు ఉపయోగపడే పనులపై దృష్టి పెట్టాలని ఉపాధి పీడీ వెంకటరత్నం సూచించారు. మంగళవారం ఏపీడీ నందకుమార్‌రెడ్డితో కలసి తంబళ్లపల్లె మండలంలో పర్యటించారు. తొలుత కన్నెమడుగు సచివాలయాన్ని సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బాపూజీ పట్నాయక్, ఏపీవో అంజనప్పతో కలసి ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. గతంలో ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయకపోడంపై సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏవో థామస్‌రాజ, డిప్యూటీ ఎంపీడీవోలు ప్రసాద్, మారుతీకుమార్, ఈసీ మహేశ్, టీఏలు సుజాత, పుష్పకుమారి ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ముదివేడులో 'బంగారం' సినీసందడి



పూజలు చేస్తున్న సినిమాలోని నటీనటులు

కురబలకోట, డిసెంబరు 9((ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదివేడులో 'బంగారం' సినీసందడి నెలకొంది. మంగళవారం మండలంలోని ముదివేడులో వెలసిన దండుమారెమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి షూటింగ్‌ను ప్రారంభించారు. కుషి ఫిలిమ్స్ బ్యానర్‌పై చిత్రాన్ని నిర్మించన్నట్లు ప్రొడ్యూసర్లు పి.రమేష్, కె.రాజేష్‌రెడ్డి, గాయత్రమ్మ అంజనప్ప పేర్కొన్నారు. ఈ చిత్రాన్ని మదనపల్లె పరిసర ప్రాంతాల్లో 3 నెలల పాటు చిత్రీకరించి పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరి నుంచి నిర్విరామంగా జరిపి జూన్ నెలాఖరులో విడుదలకు సన్నాహాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ చిత్రం ప్రేమ, ఫ్యాక్షన్, ఎమోషనల్‌తో నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ చిత్రానికి హీరోగా ఘట్టమనేని కుటుంబానికి చెందిన శరణ్‌కుమార్, హీరోయిన్‌గా సంకీర్తన, దర్శకుడు సుధాకర్ అని తెలిపారు.

యూత్ ఫెస్టివల్‌కు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ కుమారస్వామిగుప్త

వేంపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ హిందుస్థాన్ యూనివర్సిటీలో కలైకూడం-2025 సౌత్‌జోన్ యూత్ ఫెస్టివల్‌కు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఎంపికయ్యారు. నూజివీడులో నవంబరు 8వ తేదీ జరిగిన 39వ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్ కల్చరల్ పోటీల్లో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీకి చెందిన విద్యార్థులు కూచిపూడి, జానపద బృంద నాట్యం, ఇండియన్ బృంద గానం, క్రియేటివిటీ కొరియోగ్రఫీ, వెస్ట్రన్ ఇన్‌స్ట్రుమెంట్ డిబేట్ పోటీల్లో 32 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి సౌత్‌జోన్ ఫెస్టివల్‌కు ఎంపికయ్యారని ట్రిపుల్‌ఐటీ ఫైన్ ఆర్ట్స్ విభాగాధిపతి మొయినుద్దీన్‌ఖాన్ తెలిపారు. ఈనెల 19 నుంచి 23 వరకు జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

పొలం పనుల్లో బిజీ..బిజీగా...



గొబ్బూరివారిపల్లెలో తెల్లవారగానే పంట పొలాల్లో రైతు కూలీలు




గొబ్బూరివారిపల్లెలో మందులు పిచికారీ చేస్తున్న దృశ్యం

రాజంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు పడ్డాయి.. అన్నదాత పొలం పనుల్లో బిజీ అయ్యాడు. తమకున్న అరకొర పొలాల్లో వరి, వేరుశనగ, పసుపు తదితర పంటలను సాగు చేయడానికి సిద్ధమయ్యాడు. ఇటీవల కురిసిన ఒక మోస్తరు వర్షాలు, నదుల్లో నీరు రావడం, చెరువులో నీరు చేరడం, భూగర్భజలాలు పెరగడం వల్ల రాజంపేట డివిజన్‌లో ఏ గ్రామంలో చూసినా రైతులు వివిధ పంటలను సాగు చేస్తున్నారు. ఇంటిల్లిపాది పంట పొలాలవైపు కదులుతున్నారు. కూలీలను వెంటేసుకుని పొలాలకు వెళ్లి వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం చలికాలం అయినా వేకువజామునే లేచి భుజంపై పలుగు పారా పట్టుకుని ఉదయించే సూర్యుడి తొలిపొద్దులో చలిని కాచుకుంటూ అదో గమ్మత్తైన వాతావరణంలో వ్యవసాయ పనులు చేసుకొంటున్నారు.



గట్టుమీదపల్లెలో ఉదయమే పనిచేసి గట్లపై భోజనాలు చేస్తున్న రైతులు



వరి నాట్లలో మహిళలు



చిట్వేలి మండలం నగరిపాడులో దుక్కులు దున్నుతున్న రైతు

పిల్లల ఆరోగ్యంలో ఐసీడీఎస్ పాత్ర కీలకం



మాట్లాడుతున్న కలెక్టర్

రాయచోటి (నేతాజీ సర్కిల్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పిల్లల పోషణ, ఎదుగుల ఆరోగ్య ఫలితాలను మెరుగుపర్చడానికి ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సీడీపీవో, సూపర్‌వైజర్లను కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని బాలసంజీవని టీహెచ్ఆర్ డిస్ట్రిబ్యూషన్, గ్రోత్ రిపోర్టు పోషన్ ట్రాకర్, పీఈఎస్ హాజరు, బీటీ కిట్, తదితర అంశాలపై సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సమావేశాల్లో ఎక్కువ శాతం విద్య, ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమ శాఖకు ఎక్కువ శాతం బడ్జెట్ కేటాయిస్తోందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, పాలిచ్చే తల్లులకు పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు అందజేయడం జరుగుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు అందించే ఆహారం వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

కార్పొరేట్‌కు దోచిపెడుతున్న ప్రభుత్వాలు

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జుల ఈశ్వరయ్య

రైల్వేకోడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఆరోపించారు. మంగళవారం రైల్వేకోడూరు సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ శక్తుల కారణంగా దేశం నాశనం అవుతోందని, అందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయని ఆరోపించారు.

రాష్ట్రంలో కొత్త జిల్లాల ఎంపిక శాస్త్రీయ పద్ధతిలో లేదన్నారు. రవాణా సౌకర్యం, వనరులు, అభివృద్ధి తదితర అంశాలతో పాటు ప్రజల ఆమోదంతో నూతన జిల్లాలు ఎంపిక చేయాలన్నారు. ఇందులో కూడా మెజార్టీ అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అన్నమయ్య జిల్లా ఎంపిక ప్రక్రియ గత ప్రభుత్వంలోను, ప్రస్తుత ప్రభుత్వం లోను సక్రమంగా జరగలేదంటూ ఆందోళన మొదలైందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించి వ్యాపారులకు అండగా నిలిచిందన్నారు. భారత రాజ్యాంగం నుంచి లౌకికవాదం, ప్రజాస్వామ్యంను తొలగించడానికి బీజేపీ కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు బిల్లును ప్రవేశపెడుతోందని ఆరోపించారు. భారత రాజ్యాంగానికి తూట్లు పొడిస్తే దేశానికి తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మతాలు, కులాలను రెచ్చగొట్టే పార్టీలు మనుగడ సాధించలేవన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, రైల్వేకోడూరు పార్టీ అధ్యక్షుడు జ్యోతి చిన్నయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పందుగోల మణి, మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్, విద్యార్థి నాయకుడు తుమ్మల చైతన్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మడుమూరులో ఘనంగా వాటర్‌షెడ్ మహోత్సవ్



జలహారతి ఇస్తున్న వాటర్‌షెడ్ అధికారులు, రైతులు

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర జల్‌శక్తి అధ్వర్యంలో వాటర్‌షెడ్ నిర్మాణ పనులను తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పెద్దతిప్పసముద్రం, మొలకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట, బి.కొత్తకోట మండలాల్లో వివిధ రకాల పనులను చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం మడుమూరులో ఆరు మండలాలకు చెందిన వాటర్ షెడ్ సిబ్బంది, రైతులతో కలిసి వాటర్‌షెడ్ మహోత్సవ్ కార్యక్రమాన్ని పీవో ఖాజామొయినుద్దీన్ అధ్వర్యంలో మడుమూరు సచివాలయం వద్ద నిర్వహించారు. ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ వాటర్ షెడ్ నిర్మాణ పనులను చేపట్టడం ద్వారా నీటి నిల్వలు సమృద్ధిగా ఉంటున్నాయని, సంపతికోట ప్రాజెక్ట్ పరిధిలోని పెద్దతిప్పసముద్రం మండలంలో ఆరు గ్రామాలను పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశామన్నారు. మడుమూరు గ్రామంలో చేపట్టిన పెద్ద ఊటకుంటలు కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. దీంతో ఆ ఊటకుంటలకు జలహారతి సమర్పించి జాతికి అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ సిబ్బంది, మడుమూరు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రవీంద్రబాబు, నవీన్, గురుమూర్తి, రాపూరివాండ్లపల్లె వెంకట్రమణ రాజు, రాజారెడ్డి, శెట్టిపల్లె కిట్టన్న, లక్ష్మీనారాయణ పలువురు రైతులు పాల్గొన్నారు.

కురవంక సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

మదనపల్లె టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కురవంక సర్పంచ్ చెక్‌పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేసినట్లు డీపీవో రాధమ్మ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కురవంక పంచాయతీకి సంబంధించి చెత్త తరలించే వాహనాలు, ఇతర ఖర్చుల విషయమై సక్రమమైన బిల్లులు, ఓచర్లు సమర్పించకపోవడంతో సర్పంచ్ చలపతికి సంజాయిషీ నోటీసులు జారీ చేశారని, దీనికి సర్పంచ్ నుంచి 10 రోజుల గడువు ఇచ్చినా బిల్లులు, ఓచర్లు సమర్పించలేదన్నారు. దీంతో ఈనెల 9వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు సర్పంచ్ చెక్ పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు డీపీవో ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈ సందర్భంగా సర్పంచ్ చలపతి మాట్లాడుతూ రాజకీయ దురుద్దేశ్యంతోనే తమకు పంచాయతీ రికార్డులు అప్పగించకుండా చేయడంతో పాటు, ఇదే కారణం చూపిస్తూ కొందరు తన చెక్‌పవర్‌ను రద్దు చేయించారని, దీనిపై న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

క్రమబద్ధీకరించుకోకుంటే రిజిస్ట్రేషన్లు ఆపేస్తాం

● పీకేఎం ఉడా చైర్మన్ సురేశ్‌బాబు



మాట్లాడుతున్న పీకేఎం ఉడా చైర్మన్

మదనపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్లాన్ లేకుండా నిర్మించిన భవనాలు, అనుమతికి మించి ఎక్కువగా నిర్మించిన, డీవియేషన్ అయిన నిర్మాణాలను (బీపీఎస్) క్రమబద్ధీకరించుకోవాలని పీకేఎం ఉడా చైర్మన్ బి.ఆర్.సురేష్‌బాబు తెలిపారు. స్థానిక పీకేఎం ఉడా కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ అప్రూవల్ లేకుండా వేసిన లేఅవుట్లను కూడా క్రమబద్ధీకరించుకోవాలని ఇందుకోసం ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. లబ్ధిదారులు సకాలంలో దరఖాస్తు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ తరహాలో ప్రభుత్వం ప్రజలకు మంచి అవకాశం కల్పించిందన్నారు. ఇలాంటి పథకాలు మళ్లీ మళ్లీ రావని, ఇదే చివరి అవకాశం కావచ్చని తెలిపారు. ఎల్ఆర్ఎస్ పథకానికి ఇప్పటికే గడువు ముగిసినా ప్రభుత్వం మళ్లీ మూడు నెలలు పొడిగించిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పటికీ వినియోగించుకోకుంటే అనధికార లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు ఆపేస్తామన్నారు. ఆయా లేఅవుట్‌కు సంబంధించి మున్సిపాలిటీలో కమిషనర్, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోల నుంచి లేఅవుట్ సర్వేనంబర్లు తీసుకుని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు ఆపేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఆ లేవుట్‌లలో ప్లాట్లు కొనొద్దు..అమ్మొద్దంటూ బోర్డులు కూడా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. సమావేశంలో టౌన్ బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, టీడీపీ సీనియర్ నేత కోపూరి మల్లికార్జుననాయుడు, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, ఉడా కార్యదర్శి పి.ఆర్.మనోహర్, ప్లానింగ్ అధికారి సంధ్యారాణి, అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి మధుసూదన్, కుప్పం మున్సిపల్ చైర్మన్ సెల్వం, టీడీపీ నాయకులు ఆర్.నీలకంఠ, ఆర్.సోమశేఖర్, పూల మురళి, తదితరులు పాల్గొన్నారు.

గురి చూసి కొట్టాలి...

● పోలీసులకు ఫైరింగ్ ప్రాక్టీస్



ఫైరింగ్ ప్రాక్టీస్‌పై అవగాహన కల్పిస్తున్న ఆర్ఐ రామకృష్ణ

రాయచోటిటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా పౌరుల భద్రత కోసం నిత్యం పనిచేసే పోలీసు శాఖ తన సిబ్బందిని అత్యంత పదునుగా ఉంచేందుకు వార్షిక ఫైరింగ్ ప్రాక్టీసును ప్రారంభించింది. ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు మంగళవారం సివిల్ పోలీసు అధికారులదరికీ తుపాకీ వాడకంలో మెలకువలను నేర్పించారు. ఈ సందర్భంగా కడపలోని జేఎంజే కళాశాల సమీపంలోని రాజీవ్ స్మృతి వనం వద్ద ఉన్న పోలీసు ఫైరింగ్ రేంజ్‌లో ఈ శిక్షణ జరిగింది. ఆర్ఐ (అడ్మిన్) వీజే రామకృష్ణ దగ్గరుండి ఫైరింగ్ ప్రాక్టీస్ శిక్షణను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆర్ఐ రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తప్పక నిర్వహించే ఈ ఫైరింగ్ ప్రాక్టీస్‌లో గానీ, ఆత్మరక్షణకు, ప్రజల రక్షణ మనం తీసుకునే చర్యలను వివరించారు. శిక్షణలో పాల్గొనే ప్రతి ఒక్కరూ తమ తుపాకీ వాడకంపై ఉన్న చిన్నపాటి అనుమానాలను కూడా నివృత్తి చేసుకుని గురిని మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. అనంతరం ఆర్ఎస్ఐలు శ్రీనివాసులు, అమర్‌నాథ రెడ్డిలు తుపాకీ ని ఎలా పట్టుకోవాలి, ఎప్పుడు కాల్చాలి అనే విషయాలపై సిబ్బందికి వివరంగా నేర్పించారు. ప్రాక్టీస్‌లో సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ



వరి కోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయాధికారులు

గాలివీడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ఉండాలన్న సదుద్దేశ్యంతో ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని నూలివీడులో నిర్వహించిన వరి పంట కోత ప్రయోగం, పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలను అందించే విధంగా ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని, రైతులు తమ పంటను కనీసం మద్దతు ధర కన్నా తక్కువకు అమ్ముకోవాల్సిన అవసరం లేదని తెలియజేశారు. అంతేగాకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతన్నలకు అదనపు సౌకర్యాలు కల్పిస్తుందని, ఉచిత గోనె సంచులు సరఫరా, లేబర్ చార్జీలు, రవాణా ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సిబ్బందితో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

కడప-రేణిగుంట రోడ్డు పనులు ప్రారంభం

● భూమిపూజ చేసిన నేతలు

● శరవేగంగా రోడ్డు మరమ్మతు పనులు



నితిన్‌గడ్కరీ, పురందేశ్వరి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

రాజంపేట/పుల్లంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్లుగా ఊరిస్తున్న కడప-రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు పనులు ఎట్టకేలకు మంగళవారం ప్రారంభమయ్యాయి. రోడ్డు పునరుద్ధరణ పనులకు మంగళవారం రాజంపేట బీజేపీ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేశ్, కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి కలసి పుల్లంపేట సమీపంలోని ఆంజనేయస్వామి పుట్ట వద్ద భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ ఈ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లుగా కడప-రేణిగుంట ఎన్‌హెచ్-716 రహదారి విస్తరణ అభివృద్ధి పనులు ఆగిపోయాయన్నారు. దీంతో ప్రమాదాలు కూడా ఎక్కువయ్యాయని, ఈ విషయాన్ని కేంద్ర మంత్రి గడ్కరీ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించి రూ.100 కోట్లు విడుదల చేశారని తెలిపారు. ముఖ్యంగా ఈ రోడ్డు విస్తరణకు ఎంపీ పురందేశ్వరి ఎంతగానో కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గడ్కరీ, పురందేశ్వరి చిత్రపటాలకు కూటమి నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రశేఖర్‌నాయుడు, దాసరి వాణి, రాజు, మండల బీజేపీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇటీవలే కోడూరు నుంచి తిరుపతి వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఈ సమయంలో ఈ నిధులు రావడంతో యుద్ధప్రాతిపదికన డబల్‌లైను రోడ్డును పునరుద్ధరిస్తున్నారు. భారీ యంత్రాలను ఏర్పాటు చేసి సంబంధిత కాంట్రాక్టర్ల ద్వారా రేణిగుంట నుంచి రాజంపేట వరకు రోడ్డు పనులను శరవేగంగా ప్రారంభించారు. దెబ్బతిన్న చోట్ల తారురోడ్డు వేస్తున్నారు. నెలరోజుల్లోపు దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేయనున్నారు. మిగిలిన చోట్ల రోడ్డును వెడల్పు చేస్తారు. దీనివల్ల కడప-తిరుపతి వాసులకే కాకుండా చెన్నై, ఇటు ముంబాయి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, బళ్లారి, మహారాష్ట్ర ప్రయాణికులకు ప్రయాణం సులభతరవుతుంది. ప్రధానంగా తిరుమలకు, చెన్నైకి వెళ్లే దక్షిణాది రాష్ట్రాల ప్రజలకు ఈ రోడ్డు ఎంతో ఉపకరిస్తుంది.

అదృశ్యమైన వ్యక్తి శవమై తేలాడు...



ఆనంద (ఫైల్)

పీలేరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 5వ తేదీన అదృశ్యమైన ఓ వ్యక్తి శవమై తేలిన సంఘటన మంగళవారం పీలేరులో వెలుగు చూసింది. పీలేరు పోలీసుల కథనం మేరకు పీలేరు పట్టణం కోటపల్లెకు చెందిన బి.ఆనంద (40) ఈనెల 5వ తేదీన మధ్యాహ్నం 3 గంటల నుంచి కనిపించకుండా పోయాడు. ఆరోజు, మరుసటి రోజు అతని కోసం వెతికిన అతడి భార్య బి.రాధ, అతను కనిపించడం లేదని ఈనెల 7న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం తిరుపతి మార్గంలోని జీవన్ చెరువులో ఓ శవం తేలియాడుతూ కన్పించినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఆ శవాన్ని గమనించిన పోలీసులు, కుటుంబసభ్యులు, స్థానికులు అది ఆనంద్ శవంగా నిర్ధారించారు. పోలీసులు ఆనంద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని మృతికి గల కారణాలను విచారిస్తున్నారు.

ప్రార్థనకు ముందే పాఠశాలలో ఉండాలి



టీచర్లతో మాట్లాడుతున్న డీఈఓ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉపాధ్యాయుడు పాఠశాల ప్రార్థన సమయానికి ముందే పాఠశాలలో ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్ ఆదేశించారు. మంగళవారం కడప నగరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల జయనగర్ కాలనీ, నగర పాలక ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాల, నగర పాలక ఉర్దూ బాలికల ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమయపాలన లేని ఉపాధ్యాయులకు షోకాజ్ అందజేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు. ఎస్ఎస్‌సీ 100 రోజుల యాక్షన్‌ప్లాన్ జిల్లాలోని ప్రతి పాఠశాల తప్పనిసరిగా అమలు కావాలన్నారు. ప్రతి పాఠశాలలో డ్రాపౌట్స్, లాంగ్ ఆబ్సెంటీస్ లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు భాగ్యవతి, విజయలక్ష్మి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు మునీర, సీఆర్‌ఎంటీ శంకర్, కృష్ణ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని సందర్శించిన హంపీ పీఠాధిపతి



దువ్వూరులో అమ్మవారి ఆలయంలో విరూపాక్ష విద్యారణ్యస్వామి

దువ్వూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులోని కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని మంగళవారం హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్యస్వామి సందర్శించారు. ఆయన రాక సందర్భంగా ఆర్యవైశ్యులు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. నేరుగా ఆయన ఆలయంలోకి వెళ్లి అమ్మవారికి స్వయంగా హారతి ఇచ్చి దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయంలో కొంతసేపు సేద తీరారు. ఈ సందర్భంగా పీఠాపతిని చూసేందుకు భక్తులు తరలివచ్చారు. ఆలయాలను సందర్శన చేస్తూ ఆయన ఇక్కడికి వచ్చినట్లు స్థానిక అర్చకుడు మూర్తిస్వామి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు లింగం పట్టాబి, అధ్యక్షుడు ఆరవేటి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు యాదాల రామకృష్ణ, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూముల్లో పనులను అడ్డుకున్న అధికారులు





వివాదాస్పద భూముల్లో మట్టి తోలుతున్న దృశ్యం, అడ్డుకున్న పోలీసు, రెవెన్యూ సిబ్బంది

కాశినాయన డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మూలపల్లె సర్వేనెంబర్ 1లోని భూములు వివాదాస్పదంగా మారాయి. రెవెన్యూ అధికారులు అనుమతి లేకుండా యంత్రాల సాయంతో గంగనపల్లె గ్రామానికి చెందిన కొందరు చెట్లు పీకడం, భూములు చదును చేయడం, మట్టి తోలడం వంటి పనులు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న నర్సాపురం గ్రామస్థులు మంగళవారం ఈభూములు మావంటూ యంత్రాలతో చెట్లు తొలగించే ప్రయత్నం చేశారు. వీరిని గంగనపల్లెకు చెందిన వారు అడ్డుకున్నారు. దీంతో వీరి మధ్య ఘర్షణకు దారి తీసింది. నర్సాపురం వాసులు రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగప్రవేశం చేసి పనులను నిలుపుదల చేయించారు. ఈవిషయంపై డిప్యూటీ తహాసీల్దారు రవిశంకర్‌ను వివరణ కోరగా... ఇరు గ్రామాల వారి వద్ద ఉన్న ఆధారాలతో కార్యాలయానికి రావాలని తెలిజేశామన్నారు.

స్థలం వివాదంతో వ్యక్తి మృతి

ఖాజీపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థలం వివాదంతో పురుగులమందు తాగి పోటుగంటి హుస్సేన్ (80) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని దుంపలగట్టు గ్రామానికి చెందిన హుస్సేన్ గత కొన్ని సంవత్సరాలుగా దుంపలగట్టులో నివాసం ఉంటున్నారు. ఆయన స్థలాన్ని అదే గ్రామానికిచెందిన మరో వ్యక్తి ఆక్రమించడంతో పలు మార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఆదివారం రాత్రి పురుగులమందు తాగి తలుపులు వేసుకున్నాడు. ఉదయం తలుపు తీయకపోవడంతో భార్య గమనించి చుట్టుపక్కలవారిని పిలువడంతో అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించి, మృతుడి కుమారుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వంశీధర్ తెలిపారు.

కాగా, స్థలం వివాదం విషయం తమ దృష్టికి రాలేదని, తెలిసిన వెంటనే అక్కడ జరుగుతున్న పనులను ఆపివేశామని తహసీల్దారు రమణమ్మ తెలిపారు. కాగితాలు తీసుకురావాలని చెప్పడం జరిగిందని తహసీల్దారు రమణమ్మ అన్నారు. ఎక్కడైనా భూ సమస్యలుంటే మా దృష్టికి తీసుకురావాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్రొద్దుటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఇతను రెండు రోజుల క్రితం అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందాడని ఆసుపత్రి ఔట్ పోస్టు హెడ్‌కానిస్టేబుల్ షబ్బీర్ తెలిపారు. ఆసుపత్రి రికార్డుల్లో అతని పేరు రవి (40), తండ్రి పుల్లయ్య, రామేశ్వరం అని వివరాలు ఉన్నాయన్నారు. శవాన్ని మార్చురీలో ఉంచారని, అతనికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే మృతదేహాన్ని గుర్తించి తీసుకెళ్లాలని కోరారు.

కోర్టు భవనానికి రూ.9.20 కోట్లు మంజూరు

కలికిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని కమలాపురం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నూతన భవన నిర్మాణాలకు రూ.9.20 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. అమల్లో వున్న నిర్మాణ నిబంధనల మేరకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా హైకోర్టు రిజిస్ట్రారు (పరిపాలన)ను కోరుతూ న్యాయ, శాసన వ్యవహారాలశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి మంగళవారం పాలనాపరమైన మంజూరు ఉత్తర్వులను జారీ చేశారు. ఆర్థిక శాఖ అనుమతులు కూడా పొందినట్లు అందులో పేర్కొన్నారు.

బైకుల చోరీకి పాల్పడే ముగ్గురు అరెస్టు

- అరెస్టయిన వారిలో ఒకరు మైనరు
- 18 బైకులు స్వాధీనం
- కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ నచికేత్



మాట్లాడుతున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో పార్కింగ్ చేసిన బైకులను చోరీ చేసే ముగ్గురు వ్యక్తులను కడప వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు, సీఐ చిన్నపెద్దన్న, ఎస్ఐ అమర్‌నాథరెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కడప నగరం రవీంద్రనగర్‌కు చెందిన సయ్యద్ గౌస్ బాషా, షేక్ మహబూబ్ బాషా, వేల్పుల రవీంద్ర ఆలియాస్ మహేంద్రలు మరో బాలుడుతో కలిసి వన్ టౌన్ పరిధిలో 11, తాలుకా పోలీసుస్టేషను పరిధిలో 2, సీకేదిన్నె, కడప రిమ్స్ పోలీసుస్టేషన్ పరిధిలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను చోరీలకు పాల్పడేవారని తెలిపారు. వీరిపై వన్‌టౌన్ సీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంతో నిఘా పెట్టామన్నారు. ఈ నేపథ్యంలో దొంగతనం చేసిన బండ్లను వేరే ప్రాంతాలకు తీసు కుపోతున్నట్లు సమాచారం రావడంతో మోచంపేట సర్కిల్ వద్ద దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశారన్నారు. ప్రధాన నిందితుడు వేల్పుల రవీంద్ర ఆలియాస్ మహేంద్ర పరారీలో ఉన్నాడని.. అతని కోసం ప్రత్యేక బృందం గాలింపు చర్య లు చేపట్టిందన్నారు. పట్టుబడిన వారి వద్ద నుంచి రూ.10లక్షలు విలువ చేసే వివిధ కంపెనీలకు చెందిన 18 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకు న్నట్లు తెలిపారు. ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేసిన ప్రాంతంలో సీసీ కెమె రాల ఆధారంగా నిందితులను గుర్తించామన్నారు. నిందితులను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన సీఐ చిన్న పెద్దన్న, ఎస్ఐలు అమర్‌నాథరెడ్డి, ప్రదీప్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. కాగా, చోరీల నియంత్రణకు ప్రజలు స్వచ్ఛం ధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ సూచించారు.



బైకులను పరిశీలిస్తున్న ఎస్పీ

అకడమిక్ కన్సల్టెంట్ల భాగస్వామ్యం అవసరం

- వైవీయూ వీసీ రాజశేఖర్



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ అభివృద్ధిలో అకాడమిక్ కన్సల్టెంట్ల భాగస్వామ్యం అవసరమని వైస్ చాన్సలర్ రాజశేఖర్ తెలిపారు. జాతీయస్థాయి ర్యాంకులు పొందడంలో అకడమిక్ కన్సల్టెంట్ల పాత్ర కూడా కీలకమని చెప్పారు. మంగళవారం వైవీయూలో అకడమిక్ కన్సల్టెంట్లతో సమావేశమై మాట్లాడుతూ ప్రతి అకడమిక్ కన్సల్టెంట్ మల్టీ డిసిప్లినరీ సబ్జెక్టుల్లో విజ్ఞానాన్ని పొందాలని, బలమైన బయోడేటాను రూపొందించుకోవాలన్నారు. సబ్జెక్టుల్లో విస్తృత జ్ఞానాన్ని పొందడమే కాకుండా, పరిశోధనా పత్రాలను ఎక్కువగా రాయాలని, విశ్వవిద్యాలయం పేరుతో వాటిని ప్రచురించాలన్నారు. బోధనా నైపుణ్యాల్ని పెంపొందించుకోవాలని సూచించారు. 110 జీఓను అమలు చేయడానికి ప్రయత్నిస్తామన్నారు. ఎన్‌పీటీఈఎల్ స్వయంవంటి టీచింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా నిరంతరం కోర్సులు చదువుతూ జ్ఞానాన్ని పెంచుకోవాలన్నా రు. బోధనపరిశోధన సామర్థ్యాలు మెండుగా ఉన్నప్పుడు అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. విశ్వవిద్యాలయం అప్పజెప్పిన బాధ్యతలను జాగ్రత్తగా నిర్వర్తించాలని సూచించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ కూడా పలు సూచనలు చేశారు. అకడమిక్ కన్సల్టెంట్ హరినాథ్‌రెడ్డి, వీరప్ప, వెంకటేష్, రమణ, దామోదర్,మానస పలు సమస్యలను ఉపకులపతి దృష్టికి తెచ్చారు. సమావేశంలో అకడమిక్‌కన్సల్టెంట్లు పాల్గొన్నారు.

స్కాలర్లు యూజీసీ నెట్ అర్హత సాధించాలి

విశ్వవిద్యాలయంలోని ప్రతి స్కాలర్ యూనివర్సిటీ గ్రాంట్‌కమీషన్ నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్) అర్హత సాధించాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ ఆకాంక్షించారు. మంగళవారం యోగి వేమన విశ్వవిద్యాలయంప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఉచ్చరత శిక్ష అభియాన్ సహకారంతో జరుగుతున్న యూ జీసీ, సీఎస్ఐఆర్‌నెట్ శిక్షణ తరగతులకు ఆయన హాజరయ్యారు. బోధన వైఖరులు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధి స్తే లెక్చరర్ షిప్‌నకు అర్హత లభిస్తుందన్నారు. నిత్యం సాధన చేయాలని సూచించారు. ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య విజయ భారతి, స్కాలర్లు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని త్వరితగతిన పూర్తి చేస్తాం



కోటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రంథాలయ సిబ్బంది

కడప మారుతీనగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిర్మాణ దశలో ఊగిసలాడుతున్న జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ జి.కోటేశ్వరరావు స్పష్టం చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం కడపకు విచ్చేసిన కోటేశ్వరరావు కడపలో నిర్మాణ దశలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయం నిర్మాణానికి వీలుగా ప్రభుత్వం తరపున కోటి రూపాయలు మంజూరు చేసిందన్నారు. త్వరితగతిన నిర్మాణ పనులు జరిగేలా చూడాలని ఆదేశాలిచ్చారు. అంతకుముందు నగర కొండాయపల్లెలో గల జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు కావలసిన తెలుగు అకాడమీ పుస్తకాలను, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు కావలసిన కాంపిటేషన్ పుస్తకాలను అందుబాటులో వుంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.రామకోటిరెడ్డి, డిప్యూటీ లైబ్రేరియన్ పవన్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ రాజకుమార్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు కానిస్టేబుల్ ఎంపిక



కానిస్టేబుల్ మహబూబ్‌బాషను అభినందిస్తున్న డీఎస్పీ

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో జరుగనున్న తైక్వాండో హూమ్సే పోటీలకు ప్రొద్దుటూరు ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్‌పీ మహబూబ్‌బాష ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం డీఎస్పీ భావన తన కార్యాలయంలో కానిస్టేబుల్ మహబూబ్‌బాషను అభినందించారు. నవంబరులో కాకినాడలో జరిగిన 14వ రాష్ట్రస్థాయి తైక్వాండో హూమ్సే పోటీల్లో పాల్గొని బంగారు పతకాన్ని సాధించారు. దీంతో జాతీయస్థాయి పోటీలకు మహబూబ్‌బాష ఎంపికయ్యారు. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు హైదరాబాదులోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో జరుగనున్న జాతీయస్థాయి పోటీలలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ భావన మాట్లాడుతూ జాతీయస్థాయిలో కూడా మంచి ప్రతిభను కనపరిచి పతకాన్ని సాధించాలని అభిలషించారు. మహబూబ్‌బాష ఎంపికపట్ల ట్రాఫిక్ సీఐ రాజగోపాల్, స్టేషన్ సిబ్బంది అభినందించారు.

దేశాభివృద్ధిపై మాత్రమే చట్టసభల్లో చర్చ జరగాలి

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో దేశం అభివృద్ధి చెందే విధంగా రాజ్యాంగాన్ని అనుసరించి చర్చలు జరగాలే తప్ప అనవసర విషయాలు, మతోన్మాద ఉద్రిక్తతలను రెచ్చగొట్టే విధంగా చర్చ ఉండకూడదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు హరినాథరెడ్డి హితవు పలికారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి వైపు దూసుకుపోతోందని ప్రచార ఆర్భాటమే తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. మంగళవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యతో దేశ ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నమైందని, దానిపై చర్చను కోరుతుంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కూటమి ప్రభుత్వం ప్రజలకు అవసరం లేని వాటిపై చర్చించాలని ఆర్డర్ వేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఎన్నికల ముందు బీహార్ రాష్ట్రంలో 60లక్షల మంది ఓటర్లను తొలగించే విషయంలో పెద్దకుట్ర జరిగిందన్నారు. ఒకపక్క రూపాయి విలువ పతనమవుతుంటే దాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్ సమర్థించడం ఎంత మాత్రం సబబన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రూ.కోట్లల్లో అప్పులు చేస్తోందని, ఇవన్నీఎక్కడ ఖర్చు చేస్తున్నది ప్రజలకు తెలపాలన్నారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందలేదని, దీనిపై రాష్ట్రంలోని జిల్లాల మార్కెట్ యార్డులు, ఎంపీలు, ఎమ్మెల్యేల ఇళ్ల ముందు ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 18న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, జిల్లా సభ్యులు ఎల్.నాగసుబ్బారెడ్డి, ఎన్.వెంకటశివ, గుంటి వేణుగోపాల్ పాల్గొన్నారు.

సిగటోక తెగులు నివారణకు చర్యలు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రవీంద్ర

వేంపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మండలం బక్కన్నగారిపల్లెతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో అరటి పంటకు సిగటోక ఆకుమచ్చ తెగులు సోకడంతో శాస్త్రవేత్తలు పరిశీలించి, రైతులకు నివారణ చర్యలు సూచించారు. మొదట పంటలను పరిశీలించిన కొవ్వూరు అరటి పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్ర, ఏడీఏ రవిచంద్రలు రైతులతో సమావేశం నిర్వహించారు. అరటిలో ఎరువులు, మొక్కలు నాటిన ఇరవై రోజుల నుంచి వేయాలన్నారు. ఏడునెలల వరకు అరటికి వేయాల్సిన ఎరువులు, మిశ్రమాల గురించి వివరించారు. ప్రధానంగా సిగటోక ఆకుమచ్చ తెగులు నివారణకు క్లోరోతలోనిల్ లీటర్‌కు రెండు గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. మచ్చలు కనిపించిన ఆకులపై ప్రొపికొనాజోల్ మినరల్ ఆయిల్ తగిన మోతాదులో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఇలా పూర్తిస్థాయిలో అధికారుల సూచన మేరకు మందులు వాడాలని తెలిపారు. అరటి గెలలకు మొగ్గ ఇంజక్షన్లు, తొడుగులు వేసుకున్నట్లయితే రూ.25,500 ఇస్తారని, తద్వారా కాయ నాణ్యత లభిస్తుందని తెలిపారు.

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాలల భవిత కేంద్రం, జిల్లా సత్వర చికిత్స కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం కడప రిమ్స్ ఆవరణలోని జిల్లా బాలల భవిత కేంద్రం, జిల్లా సత్వర చికిత్స కేంద్రాలను జడ్జి విజిట్ చేసి న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పుట్టినప్పటి నుండి 18 సంవత్సరాలు లోపు గల పిల్లలకు పుట్టుకతో వచ్చే ఎదుగదల లోపాలకు సంబంధించిన తల్లిదండ్రులు ఇలాంటి చికిత్స సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రత్యేక పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రత్యేక పిల్లలు కూడా ఉన్నత స్థానాలను అదిరోహిస్తున్నారన్నారు. వీరి కోసం జాతీయ న్యాయసేవాధికార సంస్థ బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయసేవల పథకం 2024 ప్రవేశపెట్టిందన్నారు. వికలాంగుల హక్కుల చట్టం 2016, మానసిక ఆరోగ్యం సంరక్షణ చట్టం 2017, జాతీయ మానసిక ఆరోగ్య విధానం 2014, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్‌లైన్ 1098, ఉచిత న్యాయ సహాయం తదితర అంశాలను తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సుభాష్ యాదవ్, బాలల భవిత కేంద్రం డాక్టర్లు, పారాలీగల్ వాలంటీర్లు, తల్లిదండ్రులు, ప్రత్యేక పిల్లలు పాల్గొన్నారు.

రసవత్తరంగా మారిన ముద్దనూరు ఎంపీపీ ఎన్నిక

ముద్దనూరు డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముద్దనూరు ఎంపీపీ ఎన్నిక రసవత్తరంగా మారిది. గత వైసీపీ ప్రభుత్వంలో 10ఎంపీటీసీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో రెండు వినహా అన్ని స్థానాలను వైసీపీ కైవసం చేసుకోవడంతో ఎంపీపీ స్థానాన్ని ఆ పార్టీనే దక్కించుకుంది. అయితే మండలాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కుడుముల ప్రదీప్‌కుమార్‌రెడ్డి మండల అభివృద్ధి కోసం నిర్వహించే అత్యంత ప్రాధాన్యత ఉన్న మండల సర్వసభ్య సమావేశాలకు డుమ్మా కొట్టడంతో ఎంపీపీపై అనర్హత వేటు పడింది. దీంతో ఈనెల 11వ తేదీ గురువారం ముద్దనూరు మండలాధ్యక్షుడి ఎన్నిక జరుగనుంది. గతంలో 10 మంది ఎంపీటీసీలకు గాను వైసీపీ 8స్థానాలు , బీజేపీ 2 స్థానాలు దక్కించుకోగా ఎంపీపీ ప్రదీప్‌కుమార్‌రెడ్డిపై అనర్హత వేటు పడగా మిగిలిన 9మంది ఎంపీటీసీలు ఎంపీపీని ఎనుకోనున్నారు. వారిలో 6మంది వైసీపీ ఎంపీటీసీలు, ముగ్గురు బీజేపీ ఎంపీటీసీలు ఉన్నారు. కాగా బీజేపీ ఎంపీటీసీలు ముగ్గురికి చేరడంతో ఇక ఇద్దరు ఎంపీటీసీలు ఆ పార్టీ వైపు వస్తే ఎంపీపీ పదవి వారికే దక్కుతుంది. దీంతో ఈ ఎన్నిక రసవత్తరంగా మారిందని సర్వత్రా చర్చసాగుతోంది.

పార్టీ కోసమే పనిచేయాలి

రెండు నెలల్లో తంబళ్లపల్లె ఇన్‌చార్జ్ నియామకం ● బూత్ కమిటీ ఎంపికలో శ్రీరాం చినబాబు



కలిచెర్లలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు
సోమల టీడీపీ నేతలతో పరిశీలకుడు నౌషాద్ అలీ

పెద్దమండ్యం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతి కార్యకర్త, నాయకుడు పార్టీ కోసమే పనిచేస్తేనే అనుకున్న లక్ష్యం ఛేదించగలమని టీడీపీ తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు వెల్లడించారు. కలిచెర్లలో మంగళవారం టీడీపీ బూత్ కమిటీ ఎంపికలో ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లి నియోజక వర్గం టీడీపీ ఇన్‌చార్జ్‌ను రెండు నెలల్లో సీఎం చంద్రబాబు ప్రకటిస్తారన్నారు. చంద్రబాబు నాయుడు నేతృత్వంలో టీడీపీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త పార్టీ కోసం పని చేయాలన్నారు. స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాలు కైవశం చేసుకోవాలన్నారు. వైసీపీ హయాంలో స్థానిక ఎన్నికల్లో వ్యవహరించిన తీరుకు దీటుగా సమాధానం ఇవ్వాలన్నారు. అధిష్టానం ఆదేశాల మేరకు తంబళ్లపల్లి నియోజక వర్గం ఇన్‌చార్జ్‌గా సామాన్య టీడీపీ కార్యకర్తకు ఇచ్చినా అందరూ కలిసి పని చేయాలన్నారు. త్వరలో మండల టీడీపీ అధ్యక్షుడు నియామకం, మండల స్థాయి నేతలతో సమావేశం జరుగుతుందన్నారు. పార్టీలో వర్గ విభేదాలకు స్వస్తి పలకాలన్నారు. గతంలో చేసిన తప్పులు జరగకుండా సరి చేసుకోవాలన్నారు. టీడీపీ కుటుంబంలో కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బోయవాల్మీకి డైరెక్టర్ మండెం ప్రభాకర, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి మధుబాబు, రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి యాలంకి దొరస్వామి నాయుడు, సర్పంచ్ నటరాజ్ నాయక్, మండల టీడీపీ అధ్యక్షుడు జిట్టా వెంకటరమణ, ఉపాధ్యక్షుడు నార శ్రీనివాసులు, టీడీపీ కోఆర్డినేటర్ మైసూరి శ్రీనివాసుయాదవ్, బిక్కా మధుకర, వేణుగోపాల్‌రెడ్డి గంగాధర, ఇస్మాయిల్(చింటూ), శ్రీకర్‌రెడ్డి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా ఉండాలి

గుర్రంకొండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పార్టీ నేతలు కలిసికట్టుగా ఉంటూ పార్టీ పదవులను సాధించుకోవాలని వాల్మీకీపురం ఏఎంసీ వైస్ చైర్మన్, సోమల మండల టీడీపీ బూత్ పరిశీలకుడు నౌషాద్‌అలీ అన్నారు. సోమల పట్టణంలోని 6వ బూత్‌లో స్థానిక నేతలతో కలిసి పర్యటించారు. సీఎం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి పేదల గుండెల్లో నిలిచిపోయారన్నారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజలు గుర్తించి పార్టీని స్థానిక ఎన్నికల్లో విజయపథంలో నడిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రజలకు కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజల వద్దకు వెళ్లి పార్టీ కార్యక్రమంలో నేతలు శివశంకర్, మల్లికార్జున, వి.మహేంద్ర, నరసింహులు, శ్రీనివాసులు నాయుడు, జాఫర్‌వలి, విశ్వనాథ్ ఆచారి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సూర్యఘర్ పథకంతోనే ఇంధన పొదుపు



ఇంధన పొదుపు గురించి అవగాహన కల్పిస్తున్న ఈఈ చంద్రశేఖర్ రెడ్డి

కలికిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాబోయే కాలంలో ఎదురయ్యే ఇంధన సమస్యకు పరిష్కారంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకాన్ని ఆచరణలో పెట్టాలని ఎస్పీడీసీఎల్ పీలేరు డివిజన్ డీఈఈ చంద్రశేఖర్ రెడ్డి చెప్పారు. అనేక రాయితీలు, ప్రోత్సాహకాలు సూర్యఘర్ ద్వారా అందిస్తున్నారన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇంధన పొదుపు గురించి మంగళవారం ఏపీ ఎస్పీడీసీఎల్ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోకపోతే రాబోయే తరాలు తీవ్రమైన ఇంధన సమస్యను ఎదుర్కోవలసి వుంటుందని హెచ్చరించారు. పర్యావరణ హితం, కాలుష్యరహితంగా అందుబాటులోకి వస్తున్న సోలార్ ఎనర్జీ వైపు ప్రజలు మొగ్గుచూపాలన్నారు. విద్యార్థి దశనుంచే ఇంధన పొదుపు గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఏపీ ఎస్పీడీసీఎల్ ఈఈ డీపీఈ దామోదర్, డీఈఈ అమీర్ బాషా, ఎంఈఓలు సురేష్‌కుమార్, నాగార్జున, వాల్మీకిపురం ఎంపీడీఓ మనోహర్ రాజు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సోమశేఖర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఏఈఈలు ముజిబుర్ రహ్మాన్, ఖాదర్ ఇలాహి, రామమూర్తి, రాజశేఖర్, వరప్రసాద్, జేఈలు అరుణ్, గోవర్ధన్, జాకీర్ హుస్సేన్, ఇతరు సిబ్బంది, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనలో యూటీఎఫ్ పాత్ర కీలకం



టెన్త్ మోడల్ పేపర్స్ ఆవిష్కరిస్తున్న మదనపల్లె డీవైఈఓ లోకేశ్వర్‌రెడ్డి

పీలేరు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో యూటీఎఫ్ పాత్ర కీలకమైందని డీవైఈఓ లోకేశ్వర్ రెడ్డి తెలిపారు. మంగళవారం పీలేరు ఎమ్మార్సీ కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఏటా పంపిణీ చేస్తున్న మోడల్ పేపర్స్‌ను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న టెన్త్ విద్యార్థుల సౌలభ్యం కోసం మోడల్ పేపర్లు ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. యూటీఎఫ్ ఇస్తున్న స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్న ఆశయంతో వారు చేస్తున్న ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు ఎస్. శివారెడ్డి, జిల్లా కార్యదర్శి ఎస్. అక్రంబాషా, మండల గౌరవాధ్యక్షుడు కే. రెడ్డెప్ప, పీలేరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ. విశ్వనాథరెడ్డి, జీ. సుధాకర్, యూనియన్ నాయకులు జీ. భాస్కర్, కిషోర్‌కుమార్ రెడ్డి, మస్తాన్, క్రిష్ణమూర్తి, శెట్టిసుబ్రమణ్యం, కేకే. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ ఆవరణలో లోపించిన శుభ్రత



పెద్దమండ్యం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం హైస్కూల్ ఆవరణలో శుభ్రత లోపించింది. దీంతో తిరగడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ఆటస్థలమంతా గడ్డి, పిచ్చి మొక్కలు, కంప చెట్లు పెరిగాయి. అక్కడ విద్యార్థులు ఆడేందుకు వీలులేదు. విరామ సమయం లో వెళ్లలేక పోతున్నారు. ఇటీవల వర్షాలకు పాఠశాల ముందు బాలికల బాత్‌రూమ్‌లు వద్ద ప్రహరీ, పాఠశాల వెనక భాగంలో కూడా ప్రహరీ కుప్ప కూలింది. ఈ ప్రాంతంలో విషపురుగులు తిరుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. మరోప క్కన పాఠశాల గ్రౌండ్ బాగాలేక పోవడంతో క్రీడలు ఆగాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు హైస్కూల్‌లో చదివిన వారు ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారు. ప్రస్తుతం పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. త్వరలో పెద్దమండ్యం పాఠశాల అభివృద్ధి నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని పీఆర్ ఇన్‌చార్జ్ ఏఈ సాబాజ్ వెల్లడించారు. వారం రోజుల్లో పాఠశాల ఆటస్థలంలో ఉన్న పిచ్చి మొక్కలు తొలగింపు పనులు చేస్తామని హెచ్‌ఎం భాగ్యమ్మ తెలిపారు.

కదిరి రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

మదనపల్లె అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కదిరి రోడ్డులో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద భారీ వాహనం నిలిచిపోయింది. దీంతో కదిరి రోడ్డు మొత్తం గంటపాటు రోడ్డుపై వాహనాలు బారులుతీరి ట్రాఫిక్ స్తంభించింది. సాధారణంగా భారీ వాహనాలు కదిరి రోడ్డులో నిషేధం. కానీ పోలీసులు నిర్లక్ష్యంతో వాహనాలు వదలడంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. అనంతరం పోలీసులు ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించడంతో ట్రాఫిక్ సమస్య తీరింది. ఇప్పటికైనా పోలీసులు భారీ వాహనాలకు అనుమతి ఇవ్వరాదని స్థానికులు కోరుతున్నారు.

కోర్టులో గంగమ్మకు ప్రత్యేక పూజలు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక బెంగళూరు రోడ్డులోని కోర్టు ఆవరణలో వెలసిన కోర్టులో గంగమ్మ ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు కోర్టులో గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. గంగమ్మను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పూజలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు పెరవలి వేణుగోపాల నాయుడు, ఉపాధ్యక్షుడు జోలపాలెం కరుణాకర్ నాయుడు, కార్యదర్శి మార్పూరి ప్రభాకర్‌నాయుడు, ట్రెజరర్ మార్పూరి మహేష్, తదితర సభ్యులు పర్యవేక్షించారు.

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చైర్మన్ సురేష్‌బాబు, సీడ్ మల్లికార్జున నాయుడు, తదితరులు

మదనపల్లె, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అనధికార నిర్మాణ భవనాలు, అనుమతులు లేని లేఅవుట్లను క్రమబద్ధీకరణ పోస్టర్లను పీకేఎం ఉడా చైర్మన్ బి.ఆర్.సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. పీకేఎం ఉడా కార్యాలయం ముందు టౌన్‌బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత కోపూరి మల్లికార్జున నాయుడు, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, ప్లానింగ్ అధికారి సంధ్యారాణి, అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి మధుసూదన్, కార్యాలయం సెక్రటరీ పి.ఆర్.మనోహర్, తదితరులు విడుదల చేశారు. వీటిని ఆయా ప్రభుత్వ కార్యాలయాలు, లేఅవుట్లు, ప్రధాన వీధుల్లో అంటించడం, ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని చైర్మన్ పేర్కొన్నారు. బీపీఎస్, ఎల్ఆర్ఎస్ పథకాలపై అవగాహన ద్వారా ఎక్కువ మంది దరఖాస్తు చేసుకోవడానికి ఆస్కారం ఏర్పడుతుందని చెప్పారు. ముఖ్యంగా దరఖాస్తు చేసుకునే విధానం, ప్రభుత్వం కల్పించిన మినహాయింపులు, దీన్ని వల్లా కలిగే లాభాలపై ప్రజల్లో చైతన్యం తేవాలని కమిషనర్ కె.ప్రమీల సూచించారు.

'అధికారులతోనే తేల్చుకుంటాం'



విగ్రహాలకు మరమ్మతులు చేసేందుకు వచ్చిన వారితో వాగ్వాదానికి దిగిన స్థానికులు

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తుప్పు పట్టిన విగ్రహాలు మాకు వద్దు అధికారులతోనే తేల్చుకుంటామని గ్రామస్తులు తేల్చి చెప్పారు. స్థానిక పీటీఎం సంతబజారులో వెలసిన ఆలయంలో పంచలోహ ఉత్సవ విగ్రహాలు తుప్పుపట్టాయని ఆంధ్రజ్యోతి పత్రికలో 'ఇదేమి దేవరా' అన్న శీర్షికన ప్రచురితమైన విషయం విదితమే. దీంతో స్పందించిన అధికారులు మంగళవారం కాంట్రాక్ట్ కార్మికులను పెద్ద తిప్పసముద్రానికి పంపి తుప్పు పట్టిన విగ్రహాలకు తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకోవాలనుకున్నారు. ఆలయం వద్దకు వచ్చిన వ్యక్తులతో స్థానికులు వాగ్వాదపడుతూ మరమ్మతులు చేయరాదని వారిని పంపేశారు. సనగరం పట్టాభిరామయ్య మాట్లాడుతూ తుప్పు పట్టిన పంచలోహ విగ్రహాలు మాకువద్దని మేము సంబంధిత అధికారుల వద్దే తేల్చుకుంటామన్నారు. స్థానికులతో కలిసి తిరుమల తిరుపతి దేవస్థానం ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి సమస్యను వివరించి నూతన విగ్రహాలు అందించే వరకు మేము వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఇందుకు స్థానికులు సహకరించాలన్నారు.

విత్తన కాయల పంపిణీలో అవకతవకలు జరగలేదు

పీలేరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన వేరుశనగ విత్తన కాయల పంపిణీలో ఎటువంటి అవకతవకలు జరగలేదని పీలేరు వ్యవసాయ శాఖ అధికారి రమాదేవి పేర్కొన్నారు. పీలేరు మండలానికి టీసీజీఎస్ 1694 రకం వేరుశనగ విత్తన కాయలు 375 క్వింటాళ్లు వచ్చాయన్నారు. వాటిని మండలంలోని రైతు సేవా కేంద్రాల ద్వారా 133 మంది అన్ని సామాజిక వర్గాల రైతులకు పంపిణీ చేశామన్నారు. ప్రధానంగా బోరు సౌకర్యం ఉండి, రబీ సీజన్‌లో వేరుశనగ వేసుకునే ఆసక్తి ఉన్న వారికి మాత్రమే విత్తనాలు అందజేశామన్నారు. విత్తనాలు అందుకున్న రైతుల వివరాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, ఎవరైనా వాటిని పరిశీలించవచ్చన్నారు. పంపిణీలో ఎటువంటి పొరపాట్లు జరగలేదని ఆమె మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

స్థానిక సంస్థల్లో టీడీపీ సత్తా చాటాలి

తంబళ్లపల్లె, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేతలు ఐకమత్యంతో కలసికట్టుగా పనిచేసి రాబోయే స్థానిక సంస్థల్లో టీడీపీ సత్తా చాటాలని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు అన్నారు. మంగళవారం మండలంలోని కుక్కరాజుపల్లెలో తంబళ్లపల్లె టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. బీసీ నేత తులసీధర్ నాయుడు, మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, గ్రామాధ్యక్షుడు బాబ్‌జాన్, మదన్‌మోహన్, శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీరాములు, చిన్నరెడ్డప్ప, కాలానారాయణ తదితరులు పాల్గొన్నారు.

అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండండి



వాల్మీకిపురంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్

వాల్మీకిపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దొంగతనాలు జరుగుతున్న దృష్ట్యా అపరిచితుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాల్మీకిపురం ఎస్ఐ చంద్రశేఖర్ సూచించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో విస్తృత ప్రచారం చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించిన ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సీఐ రాఘవరెడ్డి ఆదేశాల మేరకు రాత్రి గస్తీలు, ముమ్మర నిఘా పెట్టి ప్రజలకు భద్రత చర్యలు చేపడుతున్నామన్నారు. రాత్రిళ్లు నివాసాల చెంత గుర్తు తెలియని వ్యక్తులు తారసపడితే తక్షణం పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మండలంలో ఎవరైనా ఊళ్లకు వెళితే తమ ఇళ్లకు తాళాలు వేసుకుని ఇంటి వివరాలను పోలీసులకు బాధ్యతగా తెలియజేయాలన్నారు. పోలీసులు నిఘా చర్యలు తీసుకుంటారన్నారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఆటో ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ గోపాల్‌నాయక్, సిబ్బంది రిజ్వాన్, కుమార్, గిరిబాబు, చంద్రానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం తనిఖీ

మదనపల్లె అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె అగ్ని మాపక కేంద్రాన్ని మంగళవారం జిల్లా అగ్ని మాపక అధికారి అనిల్‌కుమార్ తనిఖీ చేశారు. రికార్డులను పరి శీలించిన ఆయన మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే స్పందించాలని, అధికారులు సమయపాలన పాటించి ప్రమాదాలను అరికట్టాలని సూచిం చారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. వాహనాలు, పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అగ్నిమాపక అధికారి శివప్ప, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయం కోసం పోరాటం

కలికిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎస్సీలకు చెందిన విలువైన భూములను తప్పుడు రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వ్యవహారంలో అక్రమాలను చక్కదిద్దకపోతే న్యాయం కోసం పోరాటానికి సిద్ధపడుతున్నట్లు రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షుడు యమలా సుదర్శనం, అధికార ప్రతినిధి ఎన్టీడీ హరి హెచ్చరించారు. మంగళవారం మాలమహానాడు నేతలతో కలిసి మాట్లాడుతూ మండలంలో దళితుల విలువైన భూములను రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఆన్‌లైన్ చేయించుకున్నారని, వాటన్నింటికీ సంబంధిత ఆధారాలతో న్యాయం కోసం పోరాడనున్నట్లు తెలిపారు. ఈ విషయంపై ఇదివరకే అధికారలకు వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేదని విమర్శించారు. కార్యక్రమంలో రాయలసీమ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు యమలా చంద్రయ్య, జిల్లా అధ్యక్షుడు మల్లెల మోహన్, ఉపాధ్యక్షుడు మనోహర్, ఇతర నాయకులు ఎన్టీ రమణ, సురేష్, శ్యామ్, విజయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో కాన్పు తల్లీబిడ్డకు క్షేమం

వాల్మీకిపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు క్షేమమని చింతపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి జులేఖాబేగం అన్నారు. ప్రతినెలా నిర్వహించే ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్త, చికిత్స తద్వారా ప్రభుత్వ పథకాల లబ్ధి తదితర విషయాలు తెలియజేశారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్‌రఫీ, సూపర్‌వైజర్లు బాను, బహుద్దీన్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నిమ్మనపల్లి-మదనపల్లి మార్గంలో రూ.4.50కోట్లతో తారు రోడ్డు



నిమ్మనపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లి-మదనపల్లి రోడ్డులో రూ.4.50కోట్లతో తారు రోడ్డు పనులు ప్రారంభించినట్లు ఆర్‌అండ్‌బీ డీఈ సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నిమ్మనపల్లి-మదనపల్లి రోడ్డు సక్రమంగా లేక గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రభుత్వం రూ.4.50కోట్లతో 18కిలోమీటర్లు 1లేయర్ తారు రోడ్డు వేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే రోడ్డు చుట్టుపక్కలా యంత్రాలతో క్లీనింగ్ పనులు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. అయితే మదనపల్లి- కందూరు మార్గంలో డబుల్ రోడ్డుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

మంత్రులను కలిసిన ఈయూ గౌరవాధ్యక్షుడు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మంత్రులు మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్‌ను మదనపల్లె ఆర్టీసీ డిపోల ఈయూ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి మంగళవారం విజయవాడ, అమరావతి సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల న్యాయపరమైన సమస్యలను పరిష్కారం, డిపోల్లో మౌలిక సదుపాయాలు కల్పన వంటి అంశాలను మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళితే మంత్రి సానుకూలంగా స్పందించి ఏపీఎస్ఆర్టీసీ బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. మైనార్టీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. మైనార్టీలకు సీఎం చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. మదనపల్లె జిల్లాను ప్రకటించినందుకు మంత్రులకు కృతజ్ఞతలు తెపానని చెప్పారు.

వాల్మీకి బోయలను ఎస్టీలో చేర్చాలి

మదనపల్లె అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నమ్మి ఓట్లు వేశాం నట్టేట ముంచకండి అంటూ వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని ఏపీవీబీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగినేని గోవిందు డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు వాల్మీకి బోయలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు గుర్తు చేశారు. రాజ్యాంగాన్ని అనుసరించి అధికరణలు 14,15,16,29-1లను వెంటనే అమలు చేయాలని కోరారు. కేవలం ఉమ్మడి ఏపీలోనే వాల్మీకి బోయలను బీసీ-ఏ కింద చూపడం దారుణ మన్నారు. ఏజన్సీ ప్రాంతాల్లో ఎస్టీలుగా, మైదానప్రాంతాల్లో బీసీలుగా కొనసాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్టీ రిజర్వేషన్ కల్పించని పక్షంలో క్షేత్ర స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఆందోళనలు ఉధృతం చేస్తామని ఓ ప్రకటనలో వారు హెచ్చరించారు.

బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కోశాధికారిగా రాందాసు



ములకలచెరువు, డిసెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కోశాధికారిగా ములకలచెరువుకు చెందిన మడుమూరి రాందాసును నియమించారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు గోపి శ్రీనివాస్ రంగాల ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీ సరస్వతి పాఠశాల కరెస్పాండెంట్ రామదాసు నియామకం పట్ల పలురువు హర్షం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పాఠశాల ఆవరణలో జరిగిన అభినందన సభలో రామదాసును పలువురు అభినందించారు.

ఏపీయూఎస్ మండల కార్యవర్గం ఎన్నిక



ఆంజనేయులు - నాగభూషణం

కలకడ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) మండల కార్యవర్గాన్ని మంగళవారం జిల్లా అధ్యక్షుడు నరసింహులు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా పాపిరెడ్డిగారిపల్లి హైస్కూల్ హెచ్‌ఎం పరమేశ్వర్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నడిమిచెర్ల కొత్తపల్లి, బొంతలవారిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రేపన ఆంజనేయులు, నాగభూషణం ఎన్నుకోబడ్డారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ పిల్లల్లో దేశభక్తి, నైతిక విలువలు పెంపొందించడం, ఉపాధ్యాయ సమస్యలపై పోరాడడం తమ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నేతలు పరశురాం, రమణారెడ్డి, పచ్చర్ల సుధాకర్, శివశంకర్ పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థుల వితరణ

ములకలచెరువు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌కు మంగళవారం పూర్వ విద్యార్థులు వితరణ చేశారు. 1978-79లో టెన్త్ చదువుకున్న విద్యార్థులు పాఠశాలకు బీరువాను బహూకరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మెడికల్ స్టోర్ రమణ, రామిరెడ్డి, నరసింహారెడ్డి, అబ్దుల్లా, ఎంవీ రమణ, అనసూయమ్మ, జాన్సీ, జానకి, ఫౌజియా, శ్యామల పాల్గొన్నారు.

ఇస్తిమాకు అనుమతి కోరుతూ వినతి

రామసముద్రం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జనవరి 7, 8తేదీల్లో జరగబోయే ఇస్తిమా నిర్వహణకు అనుమతి మంజూరు చేయాలని మండల ఇస్తిమా నిర్వాహకులు ఎస్ఐ దిలీప్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ముస్లిం మతపెద్ద సిరాజ్ మాట్లాడుతూ ఇస్తిమా నిర్వహణలో శాంతి భద్రతలకు ఎలాంటి భంగం కలకుండా పోలీస్ నిబంధనలు పాటి స్తూ శాంతియుతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.